ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
ఆదివారం 29 డిసెంబరు 2024

గుండె ఆగిపోతోంది..
● అధికమవుతున్న గుండెపోట్లు
● విద్యార్థుల నుంచి యుక్త వయస్సు వారికీ..
● పెరిగిపోతున్న హఠాన్మరణాలు
● ఆహార అలవాట్లు మారడం..
జంక్‌ఫుడ్ తీసుకోవడం
● శారీరక శ్రమకు దూరమవుతున్న పర్యవసానం
6



ప్రభుత్వ కార్యాలయాలు వైసీపీ జాగీర్లు కాదని, అధికారులపై దాడులు చేస్తే ఉపేక్షించేది లేదని డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కళ్యాణ్ హెచ్చరించారు. 11 మంది ఎమ్మెల్యేలను మాత్రమే ఇచ్చి ప్రజలు బుద్ధి చెప్పినా.. వైసీపీకి ఇంకా బుద్ధి రాలేదన్నారు. దాడుల సంస్కృతికి చరమగీతం పాడకపోతే ఇక్కడే మకాం వేస్తానని, అందరినీ సరిదిద్దాక ఇక్కడ నుంచి వెళతానని అన్నారు. అధికారం పోయినా వైసీపీ నాయకులకు మదం పోలేదన్నారు. ఏ అధికారిపై దాడి చేసినా తోలు ఒలుస్తామని పవన్‌కళ్యాణ్ హెచ్చరించారు.

- అధికారులపై దాడులు చేస్తే ఉపేక్షించేది లేదు
- 11 మంది ఎమ్మెల్యేలను ఇచ్చి ప్రజలు బుద్ధి చెప్పినా.. వైసీపీకి బుద్ధిరాలేదు
- గతంలో పలువురిపై దాడులు చేసిన చరిత్ర సుదర్శన్‌రెడ్డిది
- రాయలసీమలో దాడుల సంస్కృతికి చరమగీతం పాడకపోతే..
- అన్నమయ్య జిల్లాలోనే మకాం వేస్తా
- డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కల్యాణ్

ప్రభుత్వ కార్యాలయాలు
వైసీపీ జాగీర్లు కాదు

కడప/రాయచోటి/గాలివీడు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై శుక్రవారం మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో తీవ్రంగా గాయపడ్డ ఆయన ప్రస్తుతం కడప రిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దాడి ఘటన తెలిసిన వెంటనే డిప్యూటీ సీఎం, పీఆర్ అండ్ ఆర్డీ, అటవీశాఖ మంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ తీవ్రంగా స్పందించారు. నిందితులపై కఠిన చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. తాను శనివారం కడపకు వెళ్లి బాధితుడిని పరామర్శిస్తానని అన్నారు. ఆ మేరకు ఆయన శనివారం మధ్యాహ్నం కడప విమానాశ్రయం చేరుకున్నారు. అక్కడి నుంచి నేరుగా రోడ్డు మార్గాన రిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి చికిత్స పొందుతున్న బాధిత ఎంపీడీవో జవహర్‌బాబును పరామర్శించారు. దాదాపు 15నిమిషాల పాటు ఆసుపత్రిలో ఉండి ఎంపీడీవో ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో జవహర్‌బాబు, భార్య అర్చన, కుమార్తె హాన్సి, కుమారుడు వినీత్‌లను పరామర్శించి ధైర్యంగా ఉండాలని ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆసుపత్రి ఎదుట మీడియాతో మాట్లాడారు. అనంతరం అన్నమయ్య జిల్లా గాలివీడుకు వెళ్లారు. ఘటన జరిగిన ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా పవన్‌కళ్యాణ్ మీడియాతో మాట్లాడుతూ.. ఎంపీపీ కుమారుడు జల్లా సుదర్శన్‌రెడ్డి ఎంపీపీ చాంబర్ తాళాలు ఇవ్వాలని అడుగగా ఎంపీపీ పద్మాతమ్మ వస్తే ఇస్తానని, ఇతరులకు ఇవ్వలేమని ఎంపీడీవో సమాధానం ఇచ్చారన్నారు. దీంతో ఊగిపోయిన జల్లా సుదర్శన్‌రెడ్డి ఆయన అనుచరుడు వెంకటరెడ్డి మరో పదిహేను మంది అనుచరులతో ఎంపీడీవోను తన గదిలో నిర్బంధించారన్నారు. ఎంపీడీవో చాతీపై సుదర్శన్‌రెడ్డి తన్ని కింద పడవేసి పిడిగుద్దులతో, కుర్చీలతో అమానుషంగా దాడి చేశారన్నారు. అక్కడితో ఆగక అడ్డొచ్చిన ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లను కూడా చితకబాదారన్నారు. వెంటనే అప్రమత్తమైన కార్యాలయ సిబ్బంది, ఉపాధి సిబ్బంది తలుపులు బద్దలుకొట్టి ఎంపీడీవోను రక్షించారన్నారు. అంతటి దాడికి పాల్పడిన సుదర్శన్‌రెడ్డి, తన అనుచరులు దర్జాగా మరో గంట వరకు ఎంపీడీవో కార్యాలయంలో స్వైర విహారం చెయ్యడం వారి బరితెగింపునకు నిదర్శనమన్నారు. సత్వరం స్పందించిన ఎస్ఐ రామకృష్ణ, సీఐ కొండారెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని దాడులకు పాల్పడిన వారిని అదుపులోకి తీసుకున్నారన్నారు.

ఆయనకు ఇలాంటి దాడులు కొత్తేమీ కాదు

వైసీపీ నాయకుడు జల్లా సుదర్శన్‌రెడ్డికి ఇలాంటి దాడులు కొత్తమీ కాదని గతమంతా కూడా అతనిది నేరచరిత్రే అని డిప్యూటీ సీఎం అన్నారు. గతంలో గాలివీడు మండలంలో ఎంపీడీవోలుగా విధులు నిర్వహించిన ప్రతాప్, శ్రీనివాసులరెడ్డి, శేఖర్‌నాయక్‌పై కూడా అనేక మార్లు తన అనుచరులతో దాడులకు పాల్పడ్డారన్నారు. వైసీపీ ప్రజలు 11 మంది ఎమ్మెల్యేలను కట్టబెట్టి బుద్ధిచెప్పినా ఇంకా వారికి బుద్ధి రాలేదన్నారు. ఎంపీడీవో జవహర్‌బాబుపై దాడులకు పాల్పడిన వారందరికీ ఊచలు లెక్కపెట్టిస్తామని హెచ్చరించారు. ఇలాంటి దాడులపై ఇప్పటికే ఎస్పీకి చట్టపరంగా నిక్కచ్చిగా వ్యవహరించాలని సూచించామన్నారు. అవసరమైతే డీజీపీతో చర్చించి కఠినమైన చర్యలు తీసుకునేలా ముందుకెళతామన్నారు.

భరోసా కల్పించేందుకే వచ్చా

ఇక్కడికి రావడానికి ప్రధాన కారణం.. ప్రభుత్వ ఉద్యోగులపై దాడులకు తెగబడితే చర్యలు ఏ స్థాయిలో ఉంటాయో చెప్పడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు అండగా ఉంటామన్న భరోసా కల్పించేందుకే వచ్చామని పవన్‌కళ్యాణ్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో సహనంతో ఉన్నారని, అభివృద్ధే ప్రధాన అజెండాగా ముందుకు సాగుతున్నారన్నారు. ఇలాంటి తరుణంలో వైసీపీ నాయకులు అనవసరంగా రెచ్చగొట్టి కటకటాల పాలవ్వొద్దని సూచించారు. వైసీపీ నాయకులు పిచ్చి పిచ్చి వేషాలు వేసి అధికారులను భయభ్రాంతులకు గురిచేస్తే అన్నమయ్య జిల్లాలోనే క్యాంపు ఆఫీసు ఏర్పాటు చేసుకుని రౌడీ మూకలను ఏరిపారేస్తానని హెచ్చరించారు. ఆధిపత్యపు దాడులు చేస్తే ఎదుర్కోండి మీకుఅండగా మేముంటామని ఈ సందర్భంగా రాయలసీమ యువతకు, ప్రజలకు పిలుపునిచ్చారు.

ప్రజలు ధైర్యంగా మాట్లాడాలి

జవహర్‌బాబు భార్య భయపడుతున్నారని, మేము ఎస్సీ కులానికి చెందిన వారం మాకు భయమేస్తోందని అంటే భరోసా ఇచ్చామన్నారు. కలెక్టర్, ఎస్పీ ఉన్నారు, మేము ఉన్నామని భరోసా ఇచ్చామన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇది కేవలం ప్రభుత్వం పని మాత్రమే కాదు.. ఓట్లేసి మా పని అయిపోయిందని అనుకోరాదని బయటకు వచ్చి ధైర్యంగా ఇలాంటి వాటిపై ప్రజలు మాట్లాడాలన్నారు. ఇలా దాడి చేసిన వారు భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీ చేయకుండా భయపడాలన్నారు.

ఫ్యాన్స్‌పై పవన్‌కళ్యాణ్ అసహనం

కడప రిమ్స్ వద్ద విలేకరుల సమావేశంలో పవన్‌కళ్యాణ్ మాట్లాడేటపుడు ఓజీ ఓజీ, సీఎం సీఎం అంటూ అభిమానులు నినాదాలు చేశారు. దీంతో పవన్‌కళ్యాణ్ ఏంటయ్యా మీరు ఎక్కడ ఏం చేయాలో తెలియదా అంటూ అసహనం వ్యక్తం చేశారు. పవన్‌కళ్యాణ్‌ను చూసేందుకు ఫ్యాన్స్ పెద్దత్తున ఆసుపత్రికి చేరుకున్నారు.

ఘనస్వాగతం

గాలివీడు పర్యటనకు వచ్చిన పవన్‌కళ్యాణ్‌కు ప్రజలు ఘనస్వాగతం పలికారు. అన్నమయ్య జిల్లాలోకి అడుగుపెట్టిన ఆయనకు.. దారిపొడవునా పల్లెల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పూలు చల్లి స్వాగతం పలికారు. రాయచోటి స్టేట్ గెస్ట్ హౌస్‌లో విశ్రాంతి తీసుకుని.. మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత.. 3.25 గంటలకు బయలుదేరారు. 4.23 గంటలకు గాలివీడుకు చేరుకున్నారు. 5.10గంటల వరకు ఇక్కడ ఉన్నారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన బయలుదేరి రాయచోటి మీదుగా కడపకు వెళ్లి అక్కడ నుంచి విమానం ద్వారా గన్నవరం వెళ్లారు. ఈ దారి పొడవునా పెద్ద సంఖ్యలో మహిళలు, యువత ఆయన కోసం ఎదురు చూశారు. గాలివీడు పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి.. పూలు చల్లి.. సంబరాలు చేశారు. ఆయన వెంట కడప, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, చామకూరి శ్రీధర్, ఉమ్మడి జిల్లాల ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, జడ్పీ సీఈఓ ఓబుళమ్మ, తదితరులు పాల్గొన్నారు.


గాలివీడు ఎంపీడీవో కార్యాలయంలో సంఘటన వివరాలను డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు తెలుపుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

నిందితులకు 14 రోజుల రిమాండ్

గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై దాడి చేసిన ముగ్గురు నిందితులకు లక్కిరెడ్డిపల్లె కోర్టు జడ్జి ఫైజున్నిసా 14 రోజులు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం ఎంపీడీవోపై దాడి చేసిన కేసులో మాజీ ఎంపీపీ జల్లా సుదర్శన్‌రెడ్డి, నల్లబత్తిని వెంకటరెడ్డి, కుడుముల బయ్యారెడ్డిలను అరెస్టు చేసి శనివారం కోర్టులో హాజరుపరచగా జడ్జి వారికి రిమాండ్ విధించినట్లు తెలిపారు. వారిని కడప సెంట్రల్‌జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.



రైతు ఆత్మహత్య బాధాకరం

సింహాద్రిపురం మండలంలో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న విషయం ఇక్కడ దిగగానే తెలిసిందన్నారు. ఆయన ఆత్మహత్య ఎందుకు చేసుకోవాల్సి వచ్చిందో తెలియాల్సి ఉందని, దీనిపై పూర్తి విచారణ చేస్తున్నారన్నారు. ఇది చాలా బాధకరమన్నారు. అయన ఆత్మహత్య చేసుకున్నారా లేక ఆత్మహత్య చేసుకునేలా చేశారా అనేది విచారణలో తెలుస్తుందన్నారు. విచారణ అనంతరం సరైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి సానుభూతి తెలుపుతున్నామన్నారు.

జడ్పీ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీపీఆర్ ఎంఈఏ రాష్ట్ర నేత నాగిరెడ్డి



వారిపై క్రిమినల్ కేసులు బనాయించాలి

● ఏపీపీఆర్ ఎంఈఏ నేతల డిమాండ్

కడప రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై భౌతికదాడికి పాల్పడిన వైసీపీ నేతలపై క్రిమినల్ కేసులు బనాయించి కఠినంగా శిక్షించాలని ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.నాగిరెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లంకా మల్లేశ్వరరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, భాస్కర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎంపీడీవోపై దాడికి నిరసనగా శనివారం జడ్పీ కార్యాలయం ఎదుట ఏపీపీఆర్ ఎంఈఏ ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ నాయకులు సుదర్శన్‌రెడ్డితో పాటు మరో 20 మంది విధినిర్వహణలో ఉన్న ఎంపీడీవోపై కార్యాలయ తలుపులు వేసి విచక్షణారహితంగా దాడిచేయడం విచారకరమన్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని ఇలాంటివి పునరావృత్తం కాకుండా చూడాలన్నారు. వైసీపీ నేతల దాడిని ఉద్యోగుల పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సెక్షన్ల పరిపాలనాధికారులు అశ్వత్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ప్రభాకర్, రాజేంద్రప్రసాద్, మధుసూదన్, ఏపీపీఆర్ ఎంఈఏ నేతలు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే పాఠశాలల అభివృద్ధి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతోనే పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని జిల్లా విద్యాశాఖ అధికారిణి యు.మీనాక్షి పేర్కొన్నారు. శనివారం సీపీ బ్రౌన్ గ్రంథాలయ సమావేశ మందిరంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యా కమిటీలను బలోపేతం చేయడం ద్వారా పాఠశాలలు బలోపేతం అవుతాయన్నారు. ప్రతి కమిటీ మెంబర్ తమ బాధ్యతలను తెలుసుకుని పాఠశాలల అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని కోరారు. తమతమ పాఠశాలల్లో ఏవైతే వసతుల కొరత, ఇబ్బందులు ఉన్నాయో గుర్తించి పాఠశాలలను అభివృద్ధిపథంలో నడిపించేందుకు ఈ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. మండలస్థాయిలో, పాఠశాల స్థాయిలో కూడా ఈ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఉప విద్యాశాఖ అధికారి రాజగోపాల్‌రెడ్డి, ఆర్జేడీ కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడారు. కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారులు కేశవరెడ్డి, దశరథరామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆర్పీలు అపర్ణ, సురేశ్‌కుమార్, నాగేంద్ర, సుబ్రమణ్యం అవగాహన కల్పించారు. వివిధ మండలాల ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల భూముల కొనుగోలుపై
విజిలెన్స్ విచారణ

● రామేశ్వరం, బొల్లవరం, మీనాపురం రైతుల విచారణ

● పరిహారం చెల్లింపు రికార్డుల పరిశీలన

7


రామేశ్వరం రైతులను విచారిస్తున్న విజిలెన్స్ అధికారులు

సమయపాలన పాటించని మున్సిపల్ కౌన్సిల్

● ఆగ్రహం వ్యక్తం చేసి బాయ్‌కాట్ చేసిన ఎమ్మెల్సీ

● పులివెందుల మున్సిపల్ కార్యాలయం ఎదుట కూర్చొని నిరసన

పులివెందుల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశం సమయపాలన పాటించలేదు. శనివారం ఉదయం 10.30కి సమావేశం అని నిర్ణయించారు. సమయం కంటే 5నిమిషాల ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి వచ్చారు. అనంతరం 20 నిమిషాలు దాటినా అధికారులు, కౌన్సిల్ సభ్యులు రాలేదు. దీంతో ఎమ్మెల్సీ సమావేశాన్ని బాయ్‌కాట్ చేసి కార్యాలయం ఎదుట బైఠాయించారు. వివరాలిలా..

శనివారం ఉదయం 10.30 గంటలకు పులివెందుల మున్సిపాలిటీ కార్యాలయంలో బడ్జెట్‌పై కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తీర్మానించారు. ఈ మేరకు ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డికి సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన 10.25గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని సభాభవనంలోకి వచ్చారు. దాదాపు 20నిమిషాల పాటు సభాభవనంలో ఒక్కరే కూర్చున్నారు. 10.30గంటలకు చైర్మన్, అధికారులు, కౌన్సిలర్లు అందరూ మున్సిపల్ కార్యాలయానికి వచ్చారు. కానీ ఎవ్వరూ సభాభవనంలోకి రాలేదు. దీంతో కావాలనే తనను అవమానించే రీతిలో వ్యవహరిస్తున్నారని రామగోపాల్‌రెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశాన్ని బాయ్‌కాట్ చేసి మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఓ అధికారి వచ్చి సమావేశానికి రావాలని పిలిచినా ఆయన నిరాకరించారు. ఎమ్మెల్సీ విలేకరులతో మాట్లాడుతూ ప్రజాసామ్యంలో రాజ్యాంగబద్ధంగా సాగే సమావేశాలకు ప్రధానమంత్రి అయిన, రాష్ట్రపతి అయిన నిర్ణయించిన సమయానికి వస్తారన్నారు. అందులో భాగంగానే తాను 10.25కే వచ్చానన్నారు. కానీ 20నిమిషాలు వేచి చూసినా ఎవరు లోపలికి రాలేదంటే కేవలం ఇది తనను అవమానించాలనే చేశారన్నారు. పులివెందుల మున్సిపాలిటీలో తాగునీటి సమస్య, వెలగని వీధిలైట్ల సమస్య పెండింగ్‌లో ఉన్న సీసీరోడ్ల సమస్య ఉన్నాయన్నారు. వీటికి పరిష్కారం చూపాల్సిన కౌన్సిల్ ఇలా నిర్లక్ష్యం చూపడం దారుణమని మండిపడ్డారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులందరూ సరైన పద్ధతిలో నడుచుకునేలా తగిన చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మైసూరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

దా'రుణం'

● అన్నదాతలను బలిగొన్న అప్పులు
● భార్య, ఇద్దరు పిల్లలను చంపి ఆపై భర్త..
● తన పొలంలోనే పురుగులమందు తాగి మరొకరు

సింహాద్రిపురం/పులివెందుల టౌన్/వీరపునాయునిపల్లె, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేర్వేరుచోట్ల రుణబాధలు రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపాయి. భార్య, ఇద్దరు పిల్లలను చంపి తానూ కడతేరిపోగా.. మరోచోట సొంతపొలంలోనే పైరుకు కొట్టాల్సిన మందును తాగేసి రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. బాధితులు, పోలీసుల కథనం మేరకు..

సింహాద్రిపురం మండలం దుద్దెకుంట్ల గ్రామానికి చెందిన రైతు నాగేంద్ర (41)కు భార్య వాణి(33), కుమారుడు భార్గవ్ (13), కుమార్తె గాయత్రి(12) ఉన్నారు. నాగేంద్ర తనకున్న ఒకటిన్నర ఎకరా పొలంలో చీనీ తోట సాగుచేయడమే కాకుండా 15 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని సాగుచేసేవారు. సాగు చేసిన పంటల్లో వరుసగా నష్టాలు రావడంతో అప్పులు పెరిగిపోయాయి. దీనికి తోడు వ్యవసాయ పనుల కోసం ఒక ట్రాక్టర్‌ను కూడా నాగేంద్ర కొని దానికి నెల నెల కంతులు చెల్లించేవాడు. ఇలా సుమారు రూ.20లక్షల మేర అప్పులయ్యాయి. అప్పులు ఇచ్చిన వారి నుంచి వత్తిళ్లు పెరగడంతో నాగేంద్ర తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి తోట వద్దకు భార్య కూతురు, కొడుకును ఒకరి తర్వాత ఒకరిని తీసుకెళ్లి గొంతుకు తాడు బిగించి హత్య చేశాడు. ఆపై తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. అతని ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు వెతకగా.. అర్ధరాత్రి పొలం వద్ద నలుగురి మృతదేహాలను గుర్తించారు. సంఘటన స్థలాన్ని పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. శనివారం డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ మురళీనాయక్ మాట్లాడుతూ.. అప్పుల బాధతో భార్యాపిల్లలను హత్య చేసి నాగేంద్ర ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. ఆత్మహత్యకు ఇంకేమైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు.


పులివెందుల ఆసుపత్రిలో ఉన్న మృతదేహాలను పరిశీలిస్తున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్


వీరపునాయునిపల్లె : మృతి చెందిన రైతు శ్రీనివాసులురెడ్డి (ఫైల్‌ఫొటో)

పైరుకు కొట్టే మందు తాగి..

వీరపునాయునిపల్లె మండలంలోని మొయిళ్ల చెరువు గ్రామానికి చెందిన కందుల శ్రీనివాసులరెడ్డి (57) అనే రైతు పైరుకు కొట్టే మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతను ఐదెకరాల పొలంలో మినుము సాగు చేయగా అధిక వర్షాల కారణంగా పంట పూర్తిగా దెబ్బతిని పనికిరాకుండా పోయింది. ఇప్పటికే అతనికి వ్యవసాయంలో నష్టం రావడంతో రూ.5లక్షల అప్పులయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ అప్పులు తీరే మార్గం లేక తన పొలంలోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతని భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఒకే కుటుంబంలో నలుగురు చనిపోవడం బాధాకరం : కలెక్టర్

ఒకే కుటుంబానికి చెందిన నలుగురు చనిపోవడం బాధాకరమని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. శుక్రవారం రాత్రి సింహాద్రిపురం మండలం దిద్దికుంట్ల గ్రామానికి చెందిన రైతు నాగేంద్ర తన భార్య పిల్లలను హతమార్చి ఆపై తాను ఆత్మహత్య చేసుకున్నారు. ఈ నేపథ్యంలో పోస్టుమార్టం కోసం వచ్చిన వీరి మృతదేహాలను పులివెందుల ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో కలెక్టర్ పరిశీలించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సంఘటనకు గల కారణాలను పులివెందుల డీఎస్పీ మురళీనాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో నష్టం రావడం, అలాగే గత నాలుగు సంవత్సరాలుగా విపరీతంగా అప్పులు చేయడం వల్ల ఈ సంఘటన జరిగినట్లు తెలుస్తోందన్నారు. కారణం ఏదైనా ఒకే కుటుంబంలో నలుగురు కుటుంబ సభ్యులు బలవన్మరణం చెందడం చాలా బాధాకర విషయం అన్నారు. పోలీసులు విచారణ చేస్తున్నారని, విచారణ అనంతరం పూర్తి వివరాలు తెలుస్తాయని వారి కుటుంబానికి ఆర్థిక సాయం చేసే విషయమై నిర్ణయం తీసుకుంటామన్నారు.



చెన్నంశెట్టి విష్ణుస్వరూప్

ఇతని పేరు చెన్నంశెట్టి విష్ణుస్వరూప్. మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య ఏకైక కుమారుడు. ఇతడి వయస్సు 40 సంవత్సరాలు. ఏమైందో ఏమోగాని శనివారం ఉదయం 11 గంటలకు గుండెపోటుతో హైదరాబాదులోని వారి స్వగృహంలో హఠాన్మరణం చెందారు. తన ఏకైక కుమారుడు విష్ణుస్వరూప్ హఠాన్మరణం చెందడంతో ఎమ్మెల్సీ రామచంద్రయ్య కుటుంబం కుప్పకూలిపోయింది. అతనిపై ఎన్నో ఆశలు పెట్టుకుని ఉన్నత స్థానాల్లో నిలబెట్టి తనవితీరా చూడాలనుకున్న ఆ తండ్రి, ఆ కుటుంబ ఆశలు అడియాశలయ్యాయి.



- అధికమవుతున్న గుండెపోట్లు
- విద్యార్థుల నుంచి యుక్త వయస్సు వారికీ...
- పెరిగిపోతున్న హఠాన్మరణాలు
- ఆహార అలవాట్లు మారడం.. జంక్‌ఫుడ్ తీసుకోవడం
- శారీరక శ్రమకు దూరమవుతున్న పర్యవసానం



గుండె ఆగిపోతోంది..!

అధిక ఒత్తిడి వల్లే..



అధిక ఒత్తిడి వల్లే గుండెపోట్లు వస్తున్నాయి. మానవునికి దైనందిన జీవితంలో ఏదో ఒక దానిపై ఒత్తిడి పెరుగుతోంది. ఎప్పుడు ఒత్తిడి పెరుగుతుందో గుండెకు బరువు పెరుగుతుంది. గుండెపోట్లకు హఠాన్మరణం చెందడానికి ఫలాన కారణమి కచ్చితంగా చెప్పలమే. వ్యక్తుల శరీరాలు వారి జీవన విధానం, శరీర ఆకృతి, ఇత్యాది కారణాల వల్ల గుండెపోట్లు వస్తున్నాయి. వైద్యుల సలహాల మేరకు నడుచుకుని నిత్యం వ్యాయామం చేస్తూ తగు మోతాదులో ఆహారం తీసుకుంటూ ఉంటే ఏ గుండెజబ్బు రాదు.

- డాక్టర్ సానె శేఖర్,
డిప్యూటీ డీఎంహెచ్‌వో, రాజంపేట

శారీరక శ్రమ ఉండాలి...



నిత్యం వాకింగ్, వ్యాయా మం చేస్తే గుండెపోటు రాదు. ఎవరైనా పరిశీలించండి. నూటికి 90 శాతం మనిషికి వ్యాయామం, వాకింగ్, ధ్యాన ప్రక్రియ చేసిన వారికి గుండెపోటు రాదు. ఏవేవో కొవ్వు పదార్థాలు తింటూ ఇంటి వద్దనే ఉంటూ అధిక బరుకు గురై దురలవాట్లకు లోనై అధిక ఊబకాయం ఉంటే గుండెపోటు ఎందుకు రాదు. మనిషి తన శరీరానకి నిత్యం పని కల్పించాలి. రక్త ప్రసరణ బాగా జరిగే రీతిలో పనులు చేసుకుంటూపోతే గుండెపోటు అసలే రాదు.

- డాక్టర్ సంగరాజు బాలరాజు,
గుండె వైద్య నిపుణులు, రాజంపేట

రాజంపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎందుకనో ఏమో... గత ఏడాదిగా గుండెపోట్లు పెరిగిపోతున్నాయి. ఎక్కడ చూసినా వారానికి ఇద్దరో ముగ్గురో గుండెపోటుతో చనిపోతున్నారు. మామూలుగా అయితే శారీరక శ్రమ తక్కువగా ఉండి, ఎక్కువ ఒత్తిడి కలిగి ఉండి, భారీ కాయం కలిగి ఎటువంటి శ్రమ చేయకుండా ఇంటిపట్టునే ఉండి ధూమపానం, మద్యపానం, డ్రగ్స్ అలవాట్లు ఉండి ప్రధానంగా షుగర్, బీపీ కలిగి ఉన్నవారు అందునా వయస్సు పైబడినవారు గుండెపోటుకు గురై మరణించినట్లు వింటుంటాం. అయితే ఇటీవల చిన్నారులు, 20 ఏళ్ల లోపు వయస్సు ఉన్న యువకులు, పెళ్లికాని వారు, యుక్త వయస్కులు ఎక్కువమంది చనిపోతున్నారు. శనివారం ఎమ్మెల్సీ రామచంద్రయ్య ఏకైక కుమారుడు చెన్నంశెట్టి విష్ణుస్వరూప్ (40) గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. అదేవిధంగా రాజంపేటలో ప్రముఖ వాస్తు ప్లానర్ రజనీకాంత్ శనివారం ఉదయం బాత్‌రూంకు వెళ్లి అక్కడికక్కడే గుండెపోటుకు గురై మృతి చెందారు. గత ఏడాది ఓబులవారిపల్లె మండలం గురుకుల పాఠశాలలో 13 ఏళ్ల విద్యార్థి గుండెపోటుతో మరణించిన సంఘటన అందరినీ కలచివేసింది. వికారాబాద్ ప్రైవేట్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న మేఘన అనే విద్యార్థిని రెండు రోజుల కిందట సహ విద్యార్థులతో ఆడుకుంటూ కుప్పకూలి గుండెపోటుతో మృతి చెందడంతో రాజంపేటకు చెందిన మేఘన సహచర విద్యార్థులు తల్లడిల్లిపోయారు. ఇటీవల మూడు నెలలుగా పరిశీలిస్తే నెల రోజుల కిందట రాజంపేటలో

రాజంపేటతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో గుండెపోటుతో మృతి చెందిన వారు...



లక్ష్మినారాయణ (పెనగలూరు), శ్రీనివాసులు (నందలూరు), బ్రహ్మయ్య (తాళ్లపాక), గంగయ్య (పెద్దకొత్తపల్లె), చిన్నబ్బిశెట్టి (పుల్లంపేట), రజనీకాంత్ రాజంపేట)

నిత్యం యోగాభ్యాసం చేస్తూ అందరికీ యోగ, ధ్యానం నేర్పుతూ యోగా గురువుగా గుర్తింపు పొందిన టి.రెడ్డయ్య (50) రాజంపేటలో గుండెపోటుతో మృతిచెందారు. యోగ, ధ్యానం నేర్పే గురువుకే హఠాత్తుగా గుండెపోటు రావడం, అతను మరణించడం కలచివేసింది. తదనంతరం వారం రోజులకే జిల్లాలో ప్రముఖ ఏఐటీయూసీ నాయకుడు, ఉద్యమ నేత ఎంఎస్ రాయుడు చనిపోయే గంట ముందు వరకు ప్రజా ఉద్యమాల్లో పాల్గొని ఇంటికి వచ్చి అకస్మాత్తుగా గుండెపోటుతో అక్కడికక్కడే చనిపోయాడు. నందలూరు మండలంలో పెయింటర్‌గా పనిచేసుకుంటూ జీవించే 25 ఏళ్లు కూడా నిండని పెళ్లి కాని శ్రీనివాసులు గుండెపోటుతో మరణించాడు. ఇదే నందలూరులో ఇటీవల ఓ రోజు ఉదయం 7 గంటలకు పేపరు చదువుకుంటూ జయరామిరెడ్డి అనే వ్యక్తి గుండెపోటుతో అక్కడికక్కడే మృతి చెందాడు. అదే ప్రాంతానికి చెందిన బి.రామరాజు అనే ఎలక్ట్రీషియన్ హఠాన్మరణం చెందారు. పెనగలూరులోని పాత సింగనమల గ్రామానికి చెందిన కాలి లక్ష్మీనారాయణ అనే 22 ఏళ్ల యువకుడు ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఓబులవారిపల్లె మండలం చిన్నఓరంపాడు పంచాయతీలో 50 ఏళ్ల లోపు ఒక మహిళ, అదే ప్రాంతంలో 37 ఏళ్ల ఓ యువకుడు, మంగంపేటలో మధ్య వయస్కుడు గుండెపోటుతో మృతి చెందారు. రాజంపేట నలంద కళాశాల పక్కనే నివాసముంటున్న పి.వెంకటయ్య స్నేహితుడితో మాట్లాడుతూ గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఇటీవల అతనికి రెండు స్టంట్లు కూడా వేశారు. అయినా ఎందుకనో మృతి చెందారు.

చిట్వేలిలో ఇటీవల విశ్వేశ్వరగౌడ్ అనే 50 ఏళ్ల మధ్య వయస్కుడు గుండెపోటుతో మృతి చెందారు. విశేశ్వరగౌడ్ నిత్యం వాకింగ్ చేస్తూ వ్యాయాయం చేస్తూ సన్నగా ఉన్నా గుండెపోటుతో మృతి చెందాడు. పుల్లంపేటలో కువైట్ నుంచి వచ్చిన 55 ఏళ్ల వ్యక్తి గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. తాళ్లపాక మాజీ సర్పంచ్ ఉద్దండం బ్రహ్మయ్య ఉదయం ఈశ్వరాలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి మరో నాలుగు చోట్ల వ్యక్తిగత పనులు చూసుకుని పొలం వద్దకు వెళ్లి పొలంలోనే గుండెపోటు రావడంతో మృతి చెందారు. ఒంటిమిట్ట మండలం పెద్ద కొత్తపల్లె గ్రామానికి చెందిన 56 సంవత్సరాల చెంగయ్య అనే వ్యక్తి అక్కడికక్కడే గుండెపోటుతో మరణించారు. ఈ విధంగా చెప్పుకొంటూపోతే ఊరికొకరు, వీధికొక్కరు అన్న చందంగా గుండెపోటుతో మరణిస్తున్నారు. మృతులు వందలాది మందికి చేరుతున్నారు. ప్రస్తుత వర్షాకాల, శీతాకాల సమయంలో చలి ఎక్కువగా ఉండడం శ్వాస క్రియ నెమ్మది అయి ఊపరితిత్తుల్లో నీరు చేరి చనిపోతున్నవారి సంఖ్య ఎక్కువగా ఉంది. ఒక్కో మండలాన్ని పారదర్శకంగా తీసుకుంటే గత నెలల్లోనే గుండెపోటుకు గురై మరణిస్తున్న వారి సంఖ్య 20 మందికి తగ్గడం లేదు. అందునా విద్యార్థులు, యువకులు, పెళ్లికాని వయస్కులు, నడి వయస్సు వారు ఎక్కువగా చనిపోవడం కలత కలిగించే అంశం. కుటుంబ భారాన్ని మోసేవారు చనిపోవడం వల్ల ఆయా కుటుంబాలు అనాథలుగా మారుతున్నాయి.

జీవనశైలిలో మార్పుతోనే...

మానవుడి జీవనశైలి మారడం వల్లే గుండెపోట్లు వస్తున్నాయి. మన పూర్వీకులు తెల్లవారు జాము నుంచే పంట పొలాలకు వెళ్లి పని చేసుకునేవారు. సహజ సిద్ధమైన ఎరువులతో పంటలు పండించుకుని పోషక పదార్థాలను తినేవారు. ఎక్కువగా శారీరక శ్రమ కలిగి ఉండేవారు. విద్యార్థులు ఇంటి నుంచి పాఠశాలకు కనీసం ఐదు మీటర్లు వెళ్లి క్రీడా మైదానంలో బాగా ఆడుకుని ఇంటికి వచ్చేవారు. ఇప్పుడంతా మారిపోయింది. నేటి హైటెక్ యుగంలో మానవ జీవనశైలే మారిపోయింది. పనిచేసేవారే లేకుండా పోయారు. కొవ్వు పదార్థాలు తిని సెల్ చూసుకుంటూ పనీపాటా లేకుండా ఉంటే గుండెపోట్లు రాకుండా ఎలా ఉంటాయి.



- లావులూరి శ్రీనివాసులు, జిల్లా మలేరియా మాజీ అధికారి, రాజంపేట.



- మన చిన్నతనంలో ఉన్నట్లు పాఠశాలకు నడిచి వెళ్లే పరిస్థితి లేకపోవడం, పాఠశాలల్లో క్రీడా మైదానాలే లేకపోవడం, చిన్నతనంలో అసలే వ్యాయామం లేకపోవడం వల్ల విద్యార్థి దశలోనే గుండెపోట్లు వస్తున్నాయి.
- ఎక్కువగా యువకులు, చిన్నారులు జంక్‌ఫుడ్ తీసుకోవడం, ఆహార నియమాల్లో ఎంతో తేడా రావటం, రసాయన ఎరువులతో పండే ఆహారాన్ని తినడం మరో ప్రధాన కారణంగా చూపుతున్నారు.
- బీపీ, షుగర్ వ్యాధులు ఉన్నవారు వ్యాయామం చేయకపోవడం, ఆహార నియమాలను పాటించకపోవడం, కొవ్వు పదార్థాలు ఉన్న మటన్ లాంటి ఆహారం తీసుకోవడం వల్ల కూడా గుండెపోట్లు వస్తున్నాయంటున్నారు. ఎక్కువగా ఈ మధ్య ధూమపానం, మద్యపానానికి అలవాటు పడడం, ఈ గుండెపోట్లకు ప్రధాన కారణం అంటున్నారు.
- శారీరక శ్రమ లేకుండా, వ్యాయామం చేయకుండా ఎక్కువ కొవ్వు పదార్థాలు తింటూ ఉండడం గుండెపోటుకు ప్రధాన కారణం. వృత్తిపరమైన ఒత్తిడి కలిగి ఉండడం అధికంగా ఆలోచించడం, అధిక బరువు కలిగి ఉండడం కూడా ప్రధాన కారణమని చెబుతున్నారు.
- ప్రధానంగా ఒత్తిడి ఎక్కువగా ఉండడం, నిద్రలేనితనం, రక్తం గడ్డకట్టడం లాంటి కారణాలు ప్రధానం.



అయ్యో.. పాపం చిన్నారులు...

- ఉరి వేసుకుని తండ్రి ఆత్మహత్య



శ్రీనివాసులు మృతదేహం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అయ్యో పాపం ఆ చిన్నారులు.. తండ్రి చనిపోయాడని వారికి తెలియదు. తల్లి బోరున విలపిస్తుండటం చూసి వారు కూడా ఏడుస్తుండటం అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. ఇద్దరు చిన్నారులను అనాథలను చేసి వెళ్లిపోయాడే అంటూ ఆ తల్లి రోదనలను చూసి ఆ చిన్నారులు ఏమి జరిగిందో తెలియక దిక్కుతోచని స్థితిలో వారు కూడా ఏడుస్తూనే ఉన్నారు. ఈ ఘటన శనివారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వద్ద జరిగింది. వివరాల్లోకి వెళితే... మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లె గజ్జలకుంట వద్ద మదర్‌మీరా స్కూల్‌లో ఓ గదిలో కాపురం ఉన్న శ్రీనివాసులు (32) శనివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనను చూసిన స్కూల్ పిల్లలు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగానే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపిన వివరాల మేరకు... మృతుడు శ్రీనివాసులు తంబళ్లపల్లె మండలం, మూలపల్లె నుంచి పదేళ్ల క్రితం మదనపల్లెకు బతుకుదెరువు కోసం వచ్చాడని, 5 ఏళ్ల క్రితం మదనపల్లెకు చెందిన విజయలక్ష్మీతో వివాహం చేసుకున్నాడు. మదర్ మీరా స్కూల్‌లో డ్రైవర్‌గా పనిచేస్తూ ఇటీవలే మానివేసి చిప్పిలి గ్రామంలోని అయ్యప్పస్వామి ఆలయంలో వంటమనిషిగా పనిచేస్తున్నట్లు తెలిపారు. స్కూల్‌లో పనిచేస్తున్న సమయంలో కాపురం ఉండేందుకు గది ఇచ్చారని చెప్పారు. ఇతను మద్యం తాగి భార్యను కొట్టేవాడని, ఇప్పటికే నాలుగు పర్యాయాలు ఆత్మహత్య ప్రయత్నం చేసినట్లు కుటుంబసభ్యులు చెప్పారు. భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో నాలుగురోజుల క్రితం భార్య తన పుట్టింటికి వెళ్లింది. ఆతనికి భార్యతోపాటు దేవాన్ష్ (4) కుమారుడు, దేవాన్షీ(3) కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ రామచంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ఆస్పత్రి వద్ద రోదిస్తున్న చిన్నారులు



సూర్యుడే.. గజగజ...

లోకానికి వెలుగులు నింపే సూరీడు మంచు గుప్పిట్లో చిక్కుకున్నాడు. శనివారం ఉదయం ములకలచెరువులో దట్టమైన పొగమంచు అలుముకుని తీక్షణ కిరణాల భానుడు కూడా చిన్నబోయి ముఖం చాటేశాడు. ఉదయం 9 గంటలైనా ఎండ జాడ కన్పించలేదు. అలాగే మంచు దుప్పటితో జాతీయ రహదారి కన్పించక వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

- ములకలచెరువు (ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం



మహాసభల ప్రచార యాత్రలో యూటీఎఫ్ నాయకులు

రాయచోటిటౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునేందుకు నిరంతరం పోరాటం అవసరమని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు అన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ ఈనెల 26 నుంచి 31వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ప్రచార యాత్రల్లో భాగంగా శనివారం రాయచోటిలో ప్రచారయాత్రను ప్రారంభించారు. ఈ జాత రాయచోటి నుంచి బయలుదేరి గుర్రంకొండ, అంగళ్లు, మదనపల్లె, వాయల్పాడు మీదుగా పీలేరు వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడలో జనవరి 5 నుంచి 8వ తేదీ వరకు యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మహాసభలు ప్రభుత్వ బడిని రక్షించుకోవడం, రాజ్యాంగ విలువలను కాపాడుకోవడమే ధ్యేయంగా జరుగుతున్నాయని, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున ఈ మహాసభలకు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్‌లు మాట్లాడుతూ భవిష్యత్తు కాలంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తీర్మానాలు ప్రవేశ పెట్టి విస్తృతంగా చర్చలు జరిపి వాటి సాధన కోసం ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. జనవరి 5న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా రాష్ట్ర మహాసభలు ప్రారంభమవుతాయని తెలిపారు. ముఖ్యమంత్రితో పాటు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లు పాల్గొంటారని, అలాగే వివిధ రాష్ట్రాల విద్యాశాఖ ప్రముఖులు, మంత్రులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్‌నాయుడు, సహాధ్యక్షులు శివారెడ్డి, కోశాధికారి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, దావుద్దీన్, ఆదినారాయణ, పురం వెంకట్రమణ, అక్రమ్‌బాషా, రాష్ట్ర కౌన్సిలర్లు చెంగల్‌రాజు, శివారెడ్డి, ఆడిట్ కమిటీ జిల్లా కన్వీనర్ సురేంద్రారెడ్డి, ప్రచురణల విభాగం కన్వీనర్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిటీ కన్వీనర్ సుధాకర్, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి



కురబలకోట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శనివారం మండలంలో జరిగింది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ములకలచెరువు మండలం బురకాయలకోటకు చెందిన చక్రిమ్మ (90) బతుకుదెరువు నిమిత్తం 20 ఏళ్ల క్రితం మండలంలోని అంగళ్లకు వచ్చి స్థిరపడింది. కాగా ఆమె సంతలో కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుండేది. ఆరోగ్యం ఆమెకు సహకరించకపోవడంతో కూరగాయలు అమ్మడం మానేసి, భిక్షాటన చేస్తుంది. కాగా మండలంలోని అంగళ్లు బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతుండగా మదనపల్లె నుంచి బి.కొత్తకోటకు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదంలో మృతి చెందిన వృద్ధురాలిని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని విచారించారు. ఈ మేరకు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి మహిళ మృతి

బి.కొత్తకోట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దూడకు నీరు తాపేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి ఓ మహిళ మృతి చెందిన సంఘటన శనివారం బి.కొత్తకోట మండలంలోని కోటావూరు పంచాయతీ చోటకుంటపల్లెలో జరిగింది. గ్రామానికి చెందిన పెద్దరెడ్డెప్ప భార్య చెంచమ్మ (70) తమ ఆవు దూడలను మేపేందుకు తరచూ గ్రామ శివారు ప్రాంతాలకు వెళుతుంది. యథాప్రకారం శనివారం మేపేందుకు తోలుకెళ్లింది. నీరు తాపేందుకు స్థానికంగా ఉన్న బల్లెనిచెరువు వద్దకెళ్లి ప్రమాదవశాత్తు జారి చెరువులో పడిపోయింది. గ్రామస్థులు గమనించి బయటికి తీసేసరికే మృత్యువాతపడింది. ఈ మేరకు మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు హౌస్ ఆఫీసర్ రెడ్డెప్పనాయక్ తెలిపారు.

26 సిలిండర్లు స్వాధీనం



అక్రమంగా వాడుతున్న సిలిండర్లను స్వాధీనం చేసుకున్న అధికారులు

బి.కొత్తకోట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట పట్టణంలో వాణిజ్య అవసరాల కోసం గృహోపకరణ సిలిండర్లను వినియోగిస్తున్నారన్న ఫిర్యాదుపై అధికారులు స్పందించారు. శనివారం సివిల్ సప్లైస్ డీటీ వెంకటరెడ్డి, తహసీల్దార్ మహమ్మద్‌అన్సారీ తమ సిబ్బందితో కలిసి పట్టణంలోని హోటళ్లు, టీకొట్లు, చికెన్ సెంటర్లపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 16 దుకాణాలలో నిబంధనలను అతిక్రమించి వినియోగిస్తున్న 26 వంటగ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై డీటీ వెంకటరెడ్డి మాట్లాడుతూ సిలిండర్లు అక్రమంగా వినియోగిస్తున్న 16 మందిపై 6ఏ కేసు నమోదు చేశామన్నారు. కాగా గ్యాస్ సిలిండర్ల వినియోగంపై దాడులు నిర్వహిస్తారన్న సంగతి ముందస్తుగా కొందరు హోటల్ యజమానులకు తెలియడంతో వారు సిలిండర్లు దొరకకుండా జాగ్రత్తపడ్డారని, తెలియని వారు దొరికారని పట్టణంలో ప్రచారం జరిగింది. కార్యక్రమంలో వీఆర్వోలు శ్రీరాములు, మల్లికార్జున పాల్గొన్నారు.

విద్యార్థుల ఆటో బోల్తా

- 8 మందికి గాయాలు

తంబళ్లపల్లె, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పాఠశాల నుంచి ఇళ్లకు వెళుతున్న విద్యార్థుల ఆటో బోల్తా పడటంతో 8 మంది విద్యార్థులు గాయపడిన సంఘటన తంబళ్లపల్లె మండలంలో శనివారం సాయంత్రం జరిగింది. విద్యార్థులు, తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు.. తంబళ్లపల్లె మండలం గుండ్లపల్లె పంచాయతీ రెడ్డివారిపల్లె, దిగువపల్లె, గుండ్లపల్లెకు చెందిన పలువురు విద్యార్థులు తంబళ్లపల్లె మోడల్ స్కూల్, ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. విద్యార్థులకు పాఠశాల తెరిచే సమయానికి అనువుగా బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రతిరోజూ పాఠశాలకు గుండ్లపల్లె రెడ్డిశేఖర్ నాయుడుకు చెందిన ఆటోలో వచ్చి వెళ్లేవారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం పాఠశాల ముగియగానే సుమారు 15 మందికి పైగా విద్యార్థులు ఆటోలో వారి ఇళ్లకు వెళుతున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యలో పరుసతోపు సమీపంలో విద్యార్థులు వెళుతున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో యాశ్విత (13), లాస్య (12) లిఖిత్ (14), అనిల్‌కుమార్‌రెడ్డి (14), పూర్ణిమ (11), మహమ్మద్ నవీద్ (14), హర్షిత (11), ఇంటర్మీడియట్ చదువుతున్న మౌనిక (17) గాయపడ్డారు. అక్కడే ఉన్న స్థానికులు గాయపడిన విద్యార్థులను హుటాహుటిన తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో లిఖిత్, మహమ్మద్ నవాద్‌కు మోకాళ్లు, కాళ్లకు ఎక్కువగా గాయాలవ్వడంతో మెరుగైన వైద్యం కోసం మదనపల్లె జిల్లా వైద్యశాలకు రెఫర్ చేశారు. విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆటో బోల్తా పడిందన్న విషయం తెలుసుకున్న వారి తల్లితండ్రులు, కుటుంబసభ్యులు ఆసుపత్రి వద్దకు చేరుకుని గాయపడిన బిడ్డలను చూసి రోదించారు. కాగా మద్యం తాగి ఆటో నడపటంతోనే ఈ ప్రమాదం జరిగిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మదనపల్లె ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఎంఈవో త్యాగరాజు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్, ఉపాధ్యాయులు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

బస్సు ఏర్పాటు చేయాలి

తంబళ్లపల్లె-ములకలచెరువు రహదారిలో విద్యార్థుల పాఠశాల సమయానికి అనువుగా బస్సును ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు. ఈ మార్గంలో ఉన్న బస్సు ఉదయం 9 గంటలకు పైగా వస్తుందని ఈ బస్సు తంబళ్లపల్లెకు చేరుకునే సరికి పాఠశాల ప్రారంభ సమయం దాటిపోతుందన్నారు. దీంతో ప్రతిరోజూ విద్యార్థులను ఆటోలో పాఠశాలలకు పంపిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి పాఠశాల సమయానికి అనువుగా బస్సును ఏర్పాటు చేయాలని కోరారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు, పరామర్శిస్తున్న ఎంఈవో, తదితరులు

ప్రసవానికి వచ్చి మహిళ మృతి

● డాక్టర్ల నిర్లక్ష్యమే కారణం : కుటుంబ సభ్యులు


సుమతి మృతదేహంపై పడి రోదిస్తున్న బంధువులు - (ఇన్‌సెట్‌లో) మృతురాలి ఫైల్ ఫొటో

జమ్మలమడుగు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రసవవేదనతో జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన సుమతి (28) డాక్టర్ల నిర్లక్ష్యంతో మృతిచెందిందని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపించారు. కొలిమిగుండ్ల మండలం మీర్జాపురం వాసి సుమతి రెండవ కాన్పు నిమిత్తం ఆస్పత్రిలో శుక్రవారం ఉదయం 10 గంటలకు చేరింది. అయితే శనివారం ఉదయం డాక్టర్ విజయలక్ష్మి ఆపరేషన్ చేయగా ఆడబిడ్డకు జన్మనిచ్చినట్లు వివరించారు. కాగా సుమతి మధ్యాహ్నం 1.30 గంటలకు మృతిచెందింది. ఈ విషయమై ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ రఫిక్‌పాషా 'ఆంధ్రజ్యోతి'కి వివరణ ఇస్తూ ఆపరేషన్ అనంతరం ఆమెకు ఫిట్స్ రావడంతో మరణించిందని తెలిపారు. జమ్మలమడుగు అర్బన్ ఎస్ఐ రామక్రిష్ణ ఆస్పత్రికి వెళ్లి విచారించారు. ఏది ఏమైనా ఆస్పత్రిలో డాక్టర్లు, సిబ్బందిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మృతురాలి కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం వికటించి బాలింత సుమతి మృతిచెందిందని హ్యూమన్‌రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఉభయ రాష్ట్రాల వైస్‌చైర్మన్ కుంటుమల్ల రామమోహన్, నియోజకవర్గ మహిళా చైర్మన్ అన్నపురెడ్డి రాణి డాక్టర్లతో మాట్లాడారు.

కోనేట్లో పడి మహిళ మృతి


వెంకటసుబ్బమ్మ మృతదేహం

పెద్దముడియం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పెద్దపసుపుల పొలాల్లో ప్రమాదవశాత్తు కాలుజారి కోనేట్లో పడి డి.వెంకటసుబ్బమ్మ (49) మృతి చెందింది. మృతురాలి కుమారుడు నారాయణరెడ్డి ఫిర్యాదుపై పెద్దముడియం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా.. వెంకట సుబ్బమ్మ గేదెలకు గడ్డి నిమిత్తం పంట పొలాలకు వెళ్లింది. అక్కడ ఉన్న కోనేటి వద్ద గడ్డి ఏపుగా పెరిగి ఉండడంతో కోనేటి కట్టపై ఉన్న గడ్డి కోస్తూ ప్రమాదవశాత్తు కాలుజారి కోనేటి నీటిలో పడింది. అయితే సమయానికి అక్కడ ఎవరూ లేకపోవడంతో ఆమెను ఎవరూ కాపాడలేని పరిస్థితి. ఎంతసేపటికీ వెంకటసుబ్బమ్మ ఇంటికి రాకపోవడంతో బంధువులు పొలాల్లోకి వెళ్లి వెదికారు. ఎక్కడా కనిపించకపోవడంతో అనుమానం వచ్చి కోనేటి వద్దకు వెళ్లి చూడగా వెంకటసుబ్బమ్మ మృతదేహం కనిపించింది. వెంటనే మృతదేహాన్ని బయటికి తీసి పెద్దముడియం పోలీసులకు సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి పంచనామా నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి పోలీసులు విచారణ సాగిస్తున్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యంపై చర్యలు తప్పవు

ఆర్ట్స్ బ్లాక్ ఆకస్మిక తనిఖీల్లో ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథ్‌రెడ్డి హెచ్చరించారు. రికార్డులు పక్కాగా ఉండాలని శనివారం యోగి వేమన విశ్వవిద్యాలయంలో ఆర్ట్స్ బ్లాక్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంగ్లీష్, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, ఫైన్ ఆర్ట్స్, హిస్టరీ, ఉర్దూ తెలుగు శాఖల రికార్డులను పరిశీలించారు. బోధన, బోధనేతర సిబ్బంది హాజరును పరిశీలించారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని సూచించారు. విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించకూడదని, రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. పారిశుధ్యం పట్ల శ్రద్ధ చూపని కాంట్రాక్ట్ సిబ్బందిని మందలించారు.

బీసీల అభివృద్ధికి సహకరించండి

ఈడీని కలిసిన బీసీ నేతలు


ఈడీతో సమావేశమైన బీసీ నేతలు

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల పేద ప్రజల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం వివిధ రుణాలను మంజూరు చేస్తోందని వాటిని సకాలంలో అర్హులకు అందించి వారి అభివృద్ధికి సహకరించాలని బీసీ సంఘాల నేతలు శనివారం బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జయసింహను కోరారు. వైసీపీ ప్రభుత్వం బీసీలకు ఎటువంటి రుణాలు ఇవ్వకుండా కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిందని, ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటుందనే అంశాన్ని ఈడీ దృష్టికి తీసుకువచ్చారు. సుమారు పది రకాల రుణాలకు ప్రతిపాదనలు పంపించామని అవి మంజూరు కాగానే అర్హులకు అందించే చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కొలవలి వేణుగోపాల్, వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పరిటాల వెంకటసుబ్బయ్య, రజక సంఘం నేతలు గోవిందాయపల్లె కృష్ణయ్య, నాయీబ్రాహ్మణ సంఘం నేతలు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

జేబీ హాస్పిటల్లో అడ్వాన్స్‌డ్ రోబోటిక్ రీప్లేస్‌మెంట్ సర్జరీలు

కీళ్ల మార్పిడి సదస్సులో డాక్టర్ జహంగీర్ బాషా



డాక్టర్ జహంగీర్ బాషాను మెమెంటోతో సత్కరిస్తున్న రోబోకాన్ ప్రతినిధి

కడప, ఎర్రముక్కపల్లి డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని జేబీ హాస్పిటల్లో అడ్వాన్స్‌డ్ రోబోటిక్ రీప్లేస్‌మెంట్ సర్జరీలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ జహంగీర్ బాషా పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన రోబో కాన్ 2.0 రోబోటిక్ కీళ్ల మార్పిడి సదస్సులో ఆయన మాట్లాడుతూ ఇటువంటి గౌరవం దొరకడం రాయలసీమలోనే చాలా అరుదని చెప్పారు. దేశం నలుమూలల నుంచి రోబోటిక్ కీళ్ల రీప్లేస్‌మెంట్ సర్జన్‌లు పాల్గొన్నారని అందులో తన అనుభవాలను పంచుకున్నారన్నారు. భవిష్యత్తులో కీళ్ళ మార్పిడి రోబోటిక్ అసిస్టెంట్ పద్ధతిలో జరుగుతాయని వివరించారు. జేబీ హాస్పిటల్లో ఉన్న వెలీస్ రోబో చాలా అత్యాధునిక మైనదని (ఫిఫ్త్ జనరేషన్) ఇంతకు మునుపు ఇతర రోబోల్లో ఉన్న సమస్యలు ఇందులో లేవన్నారు. ప్రస్తుతం ఆపరేషన్లు అతి తక్కువ సమయంలో ఖచ్చితత్వంతో అతి తక్కువ రక్తస్రావం, ఇన్‌ఫెక్షన్ లేకుండా జరుగుతాయన్నారు. ఇప్పటికే వందకుపైగా కీళ్ళ మార్పిడిలు చేసినట్లు వివరించారు. హాస్పిటల్ సీఈఓ డాక్టర్ జయభారతి మాట్లాడుతూ రాయలసీమ ప్రజలు ఇప్పుడు రోబోటిక్ కీళ్ళ మార్పిడి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లవలసిన అవసరం లేదని జేబీ హాస్పిటల్‌లో అవకాశం ఉందన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కలికిరి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు పొట్టేకులవారిపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రాణెమ్మ (60) మృతి చెందింది. కలికిరి పోలీసు ఇన్‌స్పెక్టర్ రెడ్డిశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. అండేకురవపల్లె దళితవాడకు చెందిన జంగం వెంకట్రమణ భార్య రాణెమ్మ పాలు కొనుక్కు రావడానికి వెళుతుండగా కలికిరి నుంచి గుట్టపాలెం ఆచార్లగొల్లపల్లెకు వస్తున్న పవన్ కల్యాణ్ ఢీకొన్నాడు. దీంతో తీవ్రంగా గాయపడిన రాణెమ్మను వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించగా మృతి చెందింది. మృతురాలి కుమారుడు సురేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పాడి ఆవు తోకను కత్తిరించిన దుండగులు

నిమ్మనపల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): పాపం పుణ్యం ఎరుగని పాడి ఆవుపై కొందరు దుండగులు అమానుషంగా ప్రవర్తిస్తూ దాని తోకను కత్తిరించారు. రాచవేటివారిపల్లి పంచాయతీ గొల్లపల్లికి చెందిన నల్లప్పగారి పెద్దవెంకటమణ పాడి ఆవును తన రేకులషెడ్‌లో కట్టేసి ఉండగా శుక్రవారం రాత్రి కొందరు వ్యక్తులు తోకను కోసివేశారు. దీంతో యజమాని పెద్దవెంకటరమణ ఉదయం ఆవును రెడ్డివారిపల్లిలోని పశువుల ఆస్పత్రిలో చికిత్స చేయించి అనంతరం కత్తిరించిన తోకను ఎత్తుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ పాడి ఆవుకు 3నెలల దూడ కూడా వుందని పాపం పుణ్యం ఎరుగని ఆవుపై అమానుషంగా తోకను కత్తిరించిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరాడు.

లింగమూర్తి జీవితం ప్రజలకే అంకితం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, మాజీ హోం మంత్రి మైసూరారెడ్డి, రాజకీయ విశ్లేషకుడు లక్ష్మీనారాయణ




వామపక్ష పార్టీ నేతలు, లింగమూర్తి అభిమానులు, కుటుంబ సభ్యులు హాజరైన సభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, చిత్రంలో ఎంవీ మైసూరారెడ్డి తదితరులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తన ప్రమేయం లేకుండా జన్మించారు, తన ప్రమేయం లేకుండానే మరణించారు, తన ప్రమేయం ఉన్న జీవితమంతా ప్రజలతోనే గడిపారని, వారి కోసమే జీవించారని, లింగమూర్తి జీవితమంతా ప్రజలకే అకింతం చేశారని, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సీనియర్ రాజకీయ నేత, మాజీ హోం మంత్రి ఎం.వీ.మైసూరారెడ్డి, ప్రముఖ రాజకీయ విశ్లేషకులు లక్ష్మీనారాయణ వ్యాఖ్యానించారు. శనివారం ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన విశ్వనాథపురం హిందూ శ్మశాన వాటికలో లింగమూర్తి స్మారక స్థూపాన్ని ఆవిష్కరించిన వారు మాట్లాడుతూ లింగమూర్తితో ఐదు శతాబ్దాల అనుబంధం ఉందని, మొదటి తరం కమ్యూనిస్టు ఉద్యమనేతలు మొదలు నేటి తరం కార్యకర్తల వరకు ఆయన నిత్య యువకుడిలా రాయలసీమ ప్రాంత సమస్యలపై నిరంతరం అలుపెరుగని పోరాటం చేశారన్నారు. రాయలసీమలోని కృష్ణాజలాలు నీటిపారుదల కోసం పోరు యాత్ర నిర్వహించారన్నారు. కోరుకున్న రంగంలో ఉద్యోగం సంపాదించుకునే వారైనా, ఏవీ కాదని


స్థూపాన్ని ఆవిష్కరిస్తున్న రామకృష్ణ, జిల్లా నేతలు

ప్రజా సమస్యలే తన సమస్యగా భావించి ఎర్రజెండా చేతపట్టారని, ఏనాడూ పదవులను ఆశించలేదని, పార్టీ కార్యాలయాన్నే ఇళ్లుగా కార్యకర్తలకు అండగా 24గంటలు ప్రజలకు అందుబాటులో ఉండేవారని వివరించారు. 1975 - 77లో జిల్లాలోని ప్రాజెక్టుల కోసం పర్యటనలు నిర్వహించారన్నారు. జిల్లా సమగ్ర సమాచార చరిత్ర, అరుణోదయ స్మృతులు అనే రెండు పుస్తకాలను రచించారని, వాటి ద్వారా పూర్తి సమాచారం జిల్లా ప్రజలకు తెలియపరిచారని కొనియాడారు. కమ్యూనిస్టు పార్టీలో ఉన్నా ప్రాంతీయ అభిమానంతో ప్రాంతీయ నేతలను బలపరిచే వారని, వారికి పూర్తి సహాయ సహకారాలు అందించే వారన్నారు. ఉద్యమాలతో పాటు కళారంగాలను బలపరిచే వారని, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపడానికి, ప్రజానాట్య మండలి రాష్ట్ర కమిటీ సభ్యులుగా రాష్ట్ర నలుమూలలా చైతన్య కార్యక్రమాలు నిర్వహించారని, వాటిని స్మరించుకుని నండూరి వెంకటేశ్వరరావు రాసిన పుస్తకంలో సాంస్కృతిక రంగంలో లింగమూర్తి పాత్ర అనే అంశాన్ని పొందుపరిచారని గుర్తుచేశారు. దేశంలో ప్రస్తుత రోజుల్లో విలువలు కోల్పోతున్నాయని పార్లమెంటులోనే అంబేడ్కర్, గాంధీ, నెహ్రూలను అవమానించినా భారత ప్రధాని నోరు మెదపడం లేదని, పైగా వారికే మద్దతు ఇవ్వడం ఈ దేశం ఎటు పోతోందని వారు ఆశ్చర్యానికి లోనయ్యారు. బీజేపీ కోరుకున్నట్లు 400సీట్లు వచ్చి ఉంటే ఈపాటికి రాజ్యాంగాన్ని ఎప్పుడో మార్చేసే వారని, రాజ్యాంగం అన్నా ప్రజాస్వామ్యం అన్నా వారికి గౌరవం లేదన్నారు. సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు గాలి చంద్ర, చంద్రశేఖర్, లెక్కల జోగిరెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ రాజా వెంగళరెడ్డి, డాక్టర్ ఓబుల్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, సిద్దిరామయ్య, మక్బూల్ బాష, వెంకటశివ, తస్లీమ్, లక్ష్మీదేవి, భాగ్యలక్ష్మి, ఆర్‌సీపీ, సీపీఐ, సీపీఎం, కార్యకర్తలు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, సానుభూతిపరులు తదితరులు పాల్గొన్నారు.

బ్రిటిష్ కాలం గ్రామాలు మాయం

పేర్లున్నాయి... మూడు గ్రామాలు లేవు ● 70 ఏళ్లుగా అలాగే పాలన


పెద్దగురవలూరు సదస్సులో పాల్గొన్న అధికారులు

చాపాడు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బ్రిటిష్‌వారు 1905-1910 మధ్య ఏర్పాటు చేసిన గ్రామాలు మాయమయ్యాయి. పేర్లున్నా గ్రామాలు లేవు. అంతేకాదు సుమారు 70 ఏళ్లగా అలాగే పాలన సాగుతోంది. ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ మూడు రెవెన్యూ గ్రామాల షెడ్యూల్ చూపుతున్నారు. లేని గ్రామాలు ఉన్నట్లు రెవెన్యూ అధికారులు రికార్డుల్లో చూపుతుండడం వింతగా అనిపిస్తోంది. హైటెక్ యుగంలోనూ గ్రామాలు లేకుండా పరిపాలన చేయడం వింతగా అనిపిస్తోంది. రెవెన్యూ అధికారులు అనేక ఏళ్లగా ఈ గ్రామాలపై దృష్టి పెట్టలేదు. వివరాల్లోకెళితే....

మండలంలో 19 రెవెన్యూ గ్రామాలను బ్రిటిష్ వారు ఏర్పాటు చేశారు. పరిపాలన సౌలభ్యం కోసం భూములను రైతుల పట్టాల పేర్లతో ఆర్‌ఎస్‌ఆర్, ఎఫ్‌ఎంబీ (ఫీల్డ్‌మ్యాప్ బుక్) వంటి రికార్డులను తయారు చేశారు. రెవెన్యూ గ్రామాలు వెదురూరు, అనంతపురం, తుమ్మలపాడు, బూడిదపాడు, కుచ్చుపాప, పల్లవోలు, చాపాడు, చియ్యపాడు, చిన్నగురవలూరు, నెర్రవాడ, కేతవరం, మడూరు, సోమాపురం, మొరాయిపల్లె, వెంగన్నగారిపల్లె, పిచ్చపాడు, పెద్దగురవలూరు, బద్రిపల్లె, అల్లాడుపల్లె ఉన్నాయి. వీటిలో తుమ్మలపాడు, బూడిదపాడు, పిచ్చపాడు రెవెన్యూ గ్రామాలు 1950 నుంచి మాయమయ్యాయి. బ్రిటిష్ వారు తయారు చేసిన రికార్డుల ప్రకారం తుమ్మలపాడులో 257.54 ఎకరాలు, బూడిదపాడులో 1070.19 ఎకరాలు, పిచ్చపాడులో 996.49 ఎకరాలు భూములు ఉన్నాయి. పిచ్చపాడుకు ఉపగ్రామాలుగా జడ్డిగారికొట్టాలు, ద్వారకానగర్ ఉన్నాయి. తుమ్మలపాడు, బూడిదపాడుకు ఉపగ్రామాలు లేవు. సుమారు 70 ఏళ్లుగా ఆ గ్రామాల్లోని ప్రజలు ఆ గ్రామాలను వదిలి వేరే గ్రామాల్లోకి వెళ్లి స్థిరపడ్డారు. తుమ్మలపాడులో సుమారు 70 కుటుంబాలవారు ఉండేవారు. ఇతర గ్రామాలతో రాకపోకలు అధ్వానంగా ఉండడంతో గ్రామస్థులంతా పక్కగ్రామాలైన అయ్యవారిపల్లె, రాజువారిపేట, సీతంపల్లె గ్రామాలకు వెళ్లిపోయారు. బూడిదపాడులో ఉన్న 150 కుటుంబాలవారు పక్క గ్రామాలైన పెద్దగురవలూరు, చిన్నగురవలూరు గ్రామాలకు వెళ్లిపోయారు. కొందరు శ్రీరాములపేట అనే కొత్త గ్రామాన్ని నిర్మించుకున్నారు. ఈ గ్రామం కుందూ నది వద్దున ఉండడంతో వరదనీరు ఆ గ్రామంలోకి వచ్చేవని గ్రామస్థులు తెలిపారు. అందువలన నష్టం జరుగుతుండడంతో ఇల్లు పడిపోతుంటాయి. పిచ్చపాడు గ్రామంలో సుమారు 40 ఇళ్లు ఉండేవి. ఆ గ్రామం వద్ద వంక ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గ్రామంలోకి వచ్చేవని తెలిపారు. ఇళ్లలోని సామాన్లు కొట్టుకు పోయేవన్నారు. నివాసానికి అనుకూలంగా లేకపోవడంతో గ్రామస్థులు పక్కగ్రామాల్లో మామిళ్లపల్లె, కొత్తపల్లె, సిద్దారెడ్డిపల్లె, ద్వారకానగరం, మైదుకూరు ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఇలా మూడు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతూ గ్రామాలను ఖాళీ చేసి వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఈ గ్రామాలు పేర్లు మాత్రమే వాడుకలో ఉన్నాభౌతికంగా ప్రజలు లేరు, గ్రామాలూ లేవు. లేని గ్రామాలను రికార్డుల్లో చూపించడం సమంజసం కాదని ఆ గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈనెల 24న అయ్యవారిపల్లెనూ, 27న పెద్దగురవలూరు, 19న సిద్దారెడ్డిపల్లెలోనూ రెవెన్యూ సదస్సుల సందర్భంగా అధికారులు గ్రామసభలు నిర్వహించారు. జిల్లా అధికారులు ఈ మూడు పేర్లను తొలగించి వాటిస్థానంలో ప్రస్తుతం ఉన్న పక్క గ్రామాలపేర్లతో రెవెన్యూ గ్రామాలను ఏర్పాటు చేయడం అవసరం ఎంతైనా ఉంది.

భార్య కనిపించలేదని ఫిర్యాదు

పోరుమామిళ్ల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తన భార్య నాలుగురోజులుగా కనిపించడం లేదని మల్లికార్జున స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోరుమామిళ్ల మండలం చల్లగిరిగెల వాసులు మల్లికార్జున భార్య కావ్య నాలుగు రోజుల కిందట ఇంటి నుంచి ఆటోలో వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వారిని, బంధువులను విచారించినా ఆమె ఆచూకీ తెలియ రానందుకు శనివారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

రైలు కింద పడి యువకుడు మృతి


పట్టాల వద్ద మృతదేహం

ముద్దనూరు డిసెంబరు28(ఆంధ్రజ్యోతి): స్థానిక బైపాస్ బిడ్జి కింద నున్న రైల్వే పట్టాల వద్ద శనివారం రైలు కింద పడి మూరబోయిన మనోజ్(23) మృతి చెందినట్లు ఎర్రగుంట్ల రైల్వే ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రైల్వే ఎస్ఐ సమాచారం మేరకు... ముద్దనూరు మండలం ఆరవేటిపల్లె వాసి మనోజ్ బీటెక్ చదువుతున్నాడు. మానసిక పరిస్థితి సరిగాలేకపోవడంతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జగనన్న కాలనీల భూముల కొనుగోలుపై

విజిలెన్స్ విచారణ

రామేశ్వరం, బొల్లవరం, మీనాపురం రైతుల విచారణ ● పరిహారం చెల్లింపు రికార్డుల పరిశీలన


రామేశ్వరం రైతులను విచారిస్తున్న విజిలెన్స్ అధికారులు

ప్రొద్దుటూరు డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీల పేరిట రైతుల నుంచి సేకరించిన వందలాది ఎకరాల భూముల వ్యవహారంలో వైసీపీ నేతలు కొందరు దళారులను ముందు పెట్టి పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విచారణ చేపట్టారు. చౌటపల్లె పంచాయతీ బొల్లవరం పొలంలో 213 ఎకరాలు, సోములవారిపల్లె పంచాయతీ రామేశ్వరం పొలంలో 155.67 ఎకరాలు, కొత్తపల్లె పంచాయతీ మీనాపురంలో 109,56 ఎకరాలు పేదల ఇళ్ల పట్టాల కోసం జగనన్న కాలనీల పేర వైసీపీ ప్రభుత్వం భూసేకరణ చేపట్టింది. ఇందులో రామేశ్వరం పొలంలో ఎకరాకు రూ.27.5లక్షలు బొల్లవరం, మీనాపురంలలో రూ. 40లక్షలు వంతున చెల్లించింది. మొత్తం 478.67 ఎకరాలకు రూ. 167 కోట్లు ప్రభుత్వం ద్వారా భూసేకరణలో రైతులకు చెల్లించారు. వాస్తవానికి ఆరోజుల్లో ఆ భూములకు మార్కెట్‌లో అంత విలువ లేకున్నా మూడింతలు అదనంగా పరిహారం చెల్లించారు. ఆ భూములు కొనుగోలు వ్యవహారంలో అప్పటి వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ముందస్తు వ్యూహంలో భాగంగా నివాసయోగ్యం కాని వ్యవసాయానికి సైతం పనికిరాని బీడు భూములను కొనుగోలు చేయించి పరిసర ప్రాంతాల్లో ప్రైవేటు వెంచర్ల రేట్లు పెంచేందుకు యత్నించారని ఆరోపణలున్నాయి. మార్కెట్ విలువ కంటే మూడింతలు అదనంగా నష్టపరిహారం అందించినందుకు దళారుల ద్వారా అప్పటి ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి రైతుల నుంచి పెద్ద ఎత్తున కమీషన్లు పొందినట్లు ఆరోపణలున్నాయి. వీటన్నింటిపై ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి భూసేకరణలో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రెండు రోజులుగా ప్రొద్దుటూరులోని రామేశ్వరం బొల్లవరం మీనాపురం జగనన్న కాలనీలను పరిశీలించారు. ఈ భూములు ఇచ్చిన రైతుల వివరాలను రెవెన్యూ అధికారుల నుంచి తీసుకున్నారు. జగనన్న లేఅవుట్లను పరిశీలించారు. రామేశ్వరం లో భూములిచ్చిన కొందరు రైతులతో విజిలెన్స్ అధికారులు మాట్లాడారు. వారికి ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారం నేరుగా అందిందా లేదా అని ఆరా తీశారు. అందిన పరిహారంలో దళారులకు, అధికారులకు ఏమైనా కమీషన్లు ఇచ్చారా అని విచారించారు. ముఖ్యంగా ఆరోజుకు అక్కడ వున్న ల్యాండ్ విలువను పరిశీలిస్తున్నారు. అందులో డీకేటీ, అసైన్డ్, పట్టా తదితర ల్యాండ్లపై పరిశీలిస్తున్నారు. ఈ విజిలెన్స్ విచారణలో డీఈ జవహర్‌రెడ్డి అగ్రికల్చర్ అధికారి బాలగంగాధర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఏఈఈ ఆకోక్‌కుమార్ కానిస్టేబుల్ రంతూబాషా వున్నారు. జగనన్నకాలనీల కోసం జరిగిన భూసేకరణలో జరిగిన అక్రమాలపై రైతులందరినీ విచారించి వారిచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా అక్కడ భూమి వాస్తవ విలువను బట్టి అప్పటి అధికారులు చెల్లించిన నష్టపరిహారంపై అంచనావేసి ప్రభుత్వానికి నష్టం చేకూర్చినట్లు తేలితే వాటి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని విజిలెన్స్ డీఈ ఆంధ్రజ్యోతికి తెలిపారు.

మట్కా స్థావరాలపై దాడులు

వేర్వేరు ఘటనల్లో ఆరుగురు అరెస్టు

రూ.52,170 నగదు, పట్టీలు స్వాధీనం

ప్రొద్దుటూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): టూటౌన్ ఏరియాలో సాగుతున్న మట్కాదందాపై జిల్లా పోలీసు అధికారుల ఆదేశాలతో మట్కా స్థావరాలపై టూటౌన్ సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో దాడులు చేపట్టారు. శనివారం సాయంత్రం జరిపిన వేర్వేరు దాడుల్లో దస్తగిరి పేట వాసులు పల్లె ప్రశాంత్, తలారి మైఖేల్‌ను అరెస్టు చేశారు. వీరి నుంచి మట్కా సంబంధించి రూ .25,800 నగదు స్లిప్పులు, రెండు బాల్ పెన్నులను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటలకు జిన్నా రోడ్డులోని కెనరా బ్యాంకు వద్ద మట్కా స్థావరంపై దాడులు చేసి దస్తగిరి పేటకు చెందిన షేక్ బషీర్‌అహ్మద్, దాదాగారి గౌస్‌బాషా, సాయిరాజేశ్వరీ కాలనీలో ఉంటున్న షేక్ మునీర్, మోడంపల్లెకు చెందిన పటాన్ జుబేర్ ఖాన్‌ను అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 26,370 నగదు పట్టీలు, మూడు బాల్ పెన్నులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బైక్ ఢీకొని వృద్ధుడికి గాయాలు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొనడంతో వృద్ధుడికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. శనివారం పట్టణంలో పని ముగించుకుని రామారావుకాలనీ, ఆటో స్టాండ్ వద్ద వెళుతున్న వృద్ధుడిని గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వస్తూ ఢీకొట్టి వెళ్లిపోయారు. రోడ్డుపై పడి గాయాలపాలైన వృద్ధుడిని స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. బాధితుడి కుమారుడు పిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

'ధర్నా తాత్కాలిక వాయిదా'

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): డీఈఓ వైఖరిపై ఉపాధ్యాయ సంఘాలు చేపట్టనున్న ధర్నాను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రకటించింది. 30వ తేదీన ధర్నా అంటూ శనివారం కార్యాలయంలో ఆర్జేడీ శామ్యూల్‌కు ఐక్యవేదిక ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. ఆర్జేడీ మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాల మేరకు సమయం ఇవ్వాలని కోరగా ఉపాధ్యాయ సంఘాల వేదిక సమ్మతించి తాత్కాలికంగా వాయిదా వేశారన్నారు. సమావేశంలో ఎస్టీయూ, యూటీఎఫ్, పీఆర్‌టీయూ, ఏపీటీఎఫ్ 257, ఏపీటీఎఫ్ 1938, పీఎస్టీయూ, ఆర్‌యూపీపీ, ఆపస్, ఎస్సీ ఎస్టీ అసోసియేషన్, ఎన్‌టీఏఎస్, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బీకే పల్లెలో భూ వివాదం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీకేపల్లెలో శనివారం భూ వివాదం చోటు చేసుకుంది. సర్వే నెంబరు 521లో ఐదెకరాల 56 సెంట్లు భూమి మోడీ రామన్నకు ప్రభుత్వం పట్టా ఇవ్వగా ఆయన తమ్ముడు చెంగన్న రెండెకరాలు, గంగమ్మకు రెండు ఎకరాల78 సెంట్లు వారసత్వంగా వచ్చింది. ఈ భూమి సమీపంలో బైపాస్‌రోడ్డు రావడంతో కుంట రూ.40 లక్షలకు పైగా పలుకుతోంది. దీంతో గంగుల్‌రెడ్డి నుంచి కృష్ణారెడ్డి కోనుగోలు చేశాడని సర్వే చేయడానికి తమ భూమిలోకి వచ్చారని బాధితులు తెలిపారు. సర్వే అధికారులను అడ్డగించడంతో అక్కడి నుంచి వారు వెళ్లిపోయారు.

ప్రతి అర్జీదారుడి ఇంటికి తప్పనిసరిగా వెళ్లాలి

-రెవెన్యూ సిబ్బందితో ఆర్డీవో జాన్ ఇర్విన్



వీఆర్వోతో మాట్లాడుతున్న కడప ఆర్డీవో జాన్ ఇర్విన్

వల్లూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సిబ్బంది ప్రతి అర్జీదారుడి ఇంటికి తప్పనిసరిగా వెళ్లాలని కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ ఆదేశించారు. శనివారం వల్లూరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతూ అర్జీదారుడి సమస్యకు పూర్తిగా పరిష్కారం చూపించాలన్నారు. క్షేత్రస్థాయికి వెళితేనే ఆ సమస్య తెలుస్తుందన్నారు. అలాగే అర్జీలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆర్డీవో కార్యాలయంలో ఒక వ్యక్తిని కేటాయించి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న అర్జీలన్నీ పరిష్కారం అవుతాయా లేదా అన్న అంశంపై నేరుగా ఆ లబ్ధిదారునికే ఫోను చేసి వివరాలు కనుక్కుంటామన్నారు. రైతులకు భరోసా కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అనంతరం అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దారు శ్రీవాణి, డిప్యూటీ తహసీల్దారు, సర్వేయరు, రెవెన్యూ సిబ్బందితో పాటు టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కడప డివిజన్‌లో 153 చౌక దుకాణాలకు నోటిఫికేషన్

కడప కలెక్టరేట్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కడప రెవెన్యూ డివిజన్ పరిధిలోని 7 మండలాలలో ఖాళీగా ఉన్న 153 చౌకదుకాణాలను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కడప రెవెన్యూ డివిజనల్ అధికారి జాన్ ఇర్విన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ మండల తహసీల్దారు కార్యాయలంలో దరఖాస్తు తీసుకొని పూరించి అందజేయాలన్నారు. దరఖాస్తులను జనవరి 5 సాయంత్రం 5 గంటల లోగా ఆయా మం డల కార్యాలయంలో అందజేయాలన్నారు. 18-40 ఏళ్లలోపు వారై ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు కేటాయించిన రిజర్వేషన్ల మేరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. చెన్నూరు మండలంలో 18 షాపులు.. అందులో 14 గతంలో భర్తీ చేయని షాపులతో పాటు మరో 4 కొత్తగా గుర్తించిన షాపులు, చింతకొమ్మదిన్నె మండలంలో 20 షాపులు (కొత్తగా 3 షాపులు)కడప మండల పరిధిలో 32(కొత్తవి 5 షాపులు), కమలాపురం మండల పరిదిలో 27 షాపులకు (3 కొత్తషాపులు) ఖాజీపేట మండలంలో 35 షాపులకు (కొత్తషాపు-1) పెండ్లిమర్రి మండలంలో 8 షాపులు(కొత్త షాపు-1) వ ల్లూరు మండలం పరిధిలో 10 షాపులభర్తీకి నోటిఫికేషన్ విడుదలైందన్నారు.

మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ



బహుమతులు అందిస్తున్న ఎంఈవో

కమలాపురం రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కమలాపురం బాలికల ఉన్నత పాఠశాల లో జరిగిన మండల స్థాయి విజ్ఞాన సైన్స్ ప్రదర్శనలో పలు పా ఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ఎంఈవో సుభాషిణి తెలిపారు. శనివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో విజ్ఞాన సైన్స్ ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా ఉద యం నుంచి మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించారు. తదుపరి 10 గంటలకు ప్రా ర్థన కార్యక్రమం జరిగింది. కమలాపురంలో నిర్వహించిన మండలస్థాయి వైజ్ఞానిక సైన్స్ కార్యక్రమానికి మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు తయారు చేసిన పరికరాలను ప్రదర్శించారు. విజేతలకు ఎంఈవో సుభాషిణి, జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.సరస్వతి, జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఖాజాపర్వీన్ బహుమతులను ప్రదానం చేశారు.

సమస్యలు పరిష్కారమయ్యేదెన్నడు

● కౌన్సిల్ సమావేశంలో సభ్యులు



మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి హాజరైన సభ్యులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న చైర్మన్ వరప్రసాద్

పులివెందుల రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కౌన్సిల్ సమావేశాల్లో సమస్యలు చె ప్పడం తప్ప పరిష్కారం అయ్యేదెన్నడు అని పలువురు కౌన్సిల్ సభ్యులు ప్రశ్నించారు. శనివారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సభాభవనంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ అధ్యక్షతన సాధారణ, బడ్జెట్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు కౌ న్సిలర్లు మాట్లాడుతూ మౌలిక సమస్యలు కూడా తీర్చకుంటే ప్రజలు నాయకుడిగా చూడడం లేదన్నారు. దీంతో మున్సిపల్ చైర్మన్ త్వరలో పరిష్కరిస్తామని చెప్పారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ అంచనాలపై చర్చ జరగలేదు. బడ్జెట్ వివరాలు చదివి వినిపించగా వాటికి ఆమోదం తెలిపారు. అసలు బడ్జెట్‌పై నోరుమెదపకపోవడం దారుణం. 2024-25లో సవరించిన బడ్జెట్ అంచనా రూ.115.83కోట్లు కాగా, 2025-26కు రూ.51.16కోట్లతో అంచనాలు తయారు చేశారు. మున్సిపాలిటీలో కోట్ల రూపాయలలో బడ్జెట్ ప్రవేశపెడుతున్నా మౌలిక సమస్యలు కూడా పరిష్కరించలేకపోతున్నారని పలువురు విమర్శించారు.

నేటి నుంచి ఉపాధి పనుల తనిఖీ

వల్లూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నామని ఎంపీడీవో రఘురాం తెలిపారు. శనివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఎస్ఆర్‌బీ నేతృత్వంలో ఈ సామాజిక తనిఖీ అధికారులు స్థానిక ఉపాధి, డీఆర్పీలతో కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్‌పీ మాట్లాడుతూ ఖచ్చితంగా గ్రామాల్లో ఈ ఉపాధి పనులు పరిశీలించాలని, ప్రతి ఒక్క కూలీ వద్దకు వెళ్లి డబ్బులు పడుతున్నాయా లేదా అని తెలుసుకోవాలన్నారు. నేటి నుంచి డీఆర్వోలు, ఉపాధి సిబ్బంది ఆయా గ్రామాలకు వెళ్లి పనులను పర్యవేక్షిస్తారన్నారు. ఈ సమావేశంలో ఏపీఓలు సుధారాణి, పార్థసారధి, టీసీలు, ఈసీ ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

8న తలనీలాల వేలం పాట

కడప కల్చరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) :కడప నగరం పుట్లంపల్లె సమీపంలోని పాల కొండలో వెలసిన పాలకొండరాయస్వామి దేవస్థానం తలనీలాల సేకరణతో పాటు టెంకాయల విక్రయాల హక్కుల కోసం జనవరి 8న ఉదయం 10 గంటలకు కడప నగర మృత్యుంజయకుంటలో గల మృత్యుంజయేశ్వరస్వామి దేవస్థానంలో వేలంపాట జరుగనుందని దేవస్థానం ఈఓ శ్రీధర్, ఆలయ చైర్మన్ రెడ్డయ్య యాదవ్ తెలిపారు. దేవదాయ ధర్మాదాయ అధికారుల సమక్షంలో నిర్వహించే ఈ బహిరంగ వేలం పాటలో తలనీలాల సేకరణకు వీలుగా 2025 ఫిబ్రవరి 1 నుంచి 2026 జనవరి 31 వరకు (శనివారాలు మాత్రమే), అలాగే టెంకాయల విక్రయాలకు పై తేదీ వరకు ఉంటుందన్నారు. కాగా తలనీలాల సేకరణ కు 50 వేలు, టెంకాయల వేలానికి 5 వేలు డిపాజిట్ ఉంటుందన్నారు.

వంట సామగ్రి వితరణ

కడప కల్చరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కడప రవీంద్రనగర్‌లోని ఓ గృహంలో గత వారం రోజుల క్రితం సిలిండర్ పేలిన దుర్ఘటనలో సర్వస్వం కోల్పోయిన కుటుంబానికి శనివారం హిమవర్షిణీ ఫౌండేషన్ అధ్యక్షురాలు గుండ్లకొండ విజయలక్ష్మి వంట సామగ్రిని వితరణ చేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ కూలి పనిచేసుకుంటూ జీవనం సాగించే ఆ కుటుంబానికి ప్రభుత్వంతో పాటు సేవా సంస్థలు ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, పుట్టా పురుషోత్తం, రెడ్డి లక్ష్మణ్, ఆల్‌షిఫా రఫి పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాల వసతి గృహంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైనట్లు ప్రిన్సిపాల్ వి.సలీంబాషా తెలిపారు. కడప నగరానికి చెందిన వైద్యుడు డాక్టర్ ఉజ్వల్ పాల్గొని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారన్నారు. వసతి గృహం డిప్యూటీ వార్డెన్ డాక్టర్ బి.స్వరూప, వైస్ ప్రిన్సిపాల్ గురువారెడ్డి, ఎన్ఎస్ఎస్ పీఓలు డాక్టర్ విజయలక్ష్మీదేవి, కోఆర్డినేటర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ధరలకే విక్రయించాలి

పెండ్లిమర్రి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ధరలకే ఎరువులు విక్రయించాలని ఏడీఏ నరసింహారెడ్డి సూచించారు. శనివారం వెల్లటూరులో ఎరువుల దుకణాలను ఏఓ ఓబులేసుతో కలిసి సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్టర్లను తనిఖీ చేశారు. అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

● మంచుదుప్పట్లో.. దోబూచులాట



దట్టమైన పొగమంచుతో కడప కొత్త రిమ్స్, శివారు ప్రాంతాలు







కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఒక్కసారి కళ్లు తెరిచి రోడ్డు మీదికి వచ్చేసరికి అంతా అయోమయం.. ఎక్కడ ఉన్నామో తెలియని గందరగోళం.. శనివారం ఉదయం వాతావరణంలో ఒక్కసారిగా మార్పు చోటుచేసుకుంది. మనం కడపలో ఉన్నామా లేక ఊటీ, కొడైకెనాల్‌లాంటి ప్రాంతాల్లో ఉన్నామా అనే సందిగ్ధం కలిగింది. వాతావరణం అంతా దట్టమైన పొగమంచుతో అలుముకుంది. ప్రధానంగా కడప నగర శివారు ప్రాంతాలైన రిమ్స్, ఎర్రముక్కపల్లెతో పాటు కొత్త రిమ్స్‌లో కూడా పొగమంచు అలుముకుంది. ఉదయం 8 గంటలు అయినా సూర్యుడు రాక ఎండలేకపోవడంతో తెల్లారిందా లేదా అన్నట్లు ఉంది. రోడ్ల మీద ప్రయాణించే వాహనదారులు రోడ్డు కనపడక ఇబ్బంది పడ్డారు. లైట్లు వేసుకున్నప్పటికి కూడా చాలా నెమ్మదిగా డ్రైవ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు పేర్కొన్నారు.

దేశ సమైక్యత, సమగ్రత, ప్రగతిశీల పోరాటాలకు సిద్ధం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



కడప నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

కడప సెవెన్ రోడ్స్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేశ సమైక్యత, సమగ్రత, ప్రగతిశీల పోరాటాలకు సిద్ధమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. సీపీఐ శత వార్షికోత్సవాల సందర్భంగా శనివారం సాయంత్రం కడప నగరంలోని సీపీఐ శ్రేణులు కోటిరెడ్డి సర్కిల్ (స్టేట్ గెస్ట్ హౌస్) నుంచి పాత కలెక్టరేట్ వరకు ర్యాలీ, అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్రగతిశీల పోరాటాలకు సీపీఐ ఎల్లప్పుడూ సిద్ధమన్నారు. వివక్షత, అణచివేత, దోపిడీ లేని సమాజం కోసం సమగ్ర అభివృద్ధి, సామాజిక న్యాయం సాధనే సీపీఐ లక్ష్యమన్నారు. సీపీఐ 1925 డిసెంబరు 26న కాన్పూర్‌లో ఆవిర్భవించి 2024 డిసెంబరు 26 నాటికి వంద సంవత్సరాలు పూర్తిచేసుకొని శతజయంతి ఉత్సవాలు నిర్వహించుకుంటోంద న్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ, జిల్లా కార్యవర్గ సభ్యురాలు ఎన్.విజయలక్ష్మి, మద్దిలేటి, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థుల ప్రతిభ

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ డిస్ట్రిక్ట్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమానికి కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సలీంబాషా తెలిపారు. శనివారం కడప ఎస్.కె.ఆర్ అండ్ ఎస్.కే.ఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఎంపికకు సంబంధించిన పత్రాలను అందజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విశాఖపట్టణంలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జనవరి 2 నుంచి ఆరో తేదీ వరకు నిర్వహిస్తున్న ఇంటర్ డిస్ట్రిక్ట్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమానికి తమ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పావని, కె.జాహ్నవి వైవీయూ తరపున ఎంపికయ్యారని చెప్పారు. సమాజ సేవలో తమ విద్యాథ్థులు పాల్గొనడంఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఎన్ఎస్ఎస్‌పీఓలు డాక్టర్ జి.విజయలక్ష్మిదేవి, డాక్టర్ పి.శశిదేవి, ఐక్య కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణవేణి, సివి కృష్ణవేణి పాల్గొన్నారు.

సీఆర్‌సీ కుమారుడి మృతి బాధాకరం

చెన్నూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి సి.రామచంద్రయ్య కుమారుడు విష్ణుస్వరూప్ ఆకస్మిక మృతి ఆ కుటుంబానికి తీరని లోటని చెన్నూరు మండల టీడీపీ నేతలు పేర్కొన్నారు. శనివారం మండల కన్వీనర్ కె. విజయ్‌భాస్కర్‌రెడ్డి, బలిజ సంఘం జిల్లా నాయకులు ఆకుల ప్రసాద్‌బాబు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శివారెడ్డి మాట్లాడారు. ఆ కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు ఆకుల చలపతి, మండల ఉపాధ్యక్షుడు కుంచం రామకృష్ణారెడ్డి, ఆటో యూనియన్ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, మైనార్టీ నేత షబ్బీర్ హుస్సేన్ తెలిపారు.

సీఆర్‌సీ తనయుడి మృతి విచారకరం

కడప మారుతీనగర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎంఎల్‌సీ సి. రామచంద్రయ్య తనయుడు విష్ణుస్వరూప్ ఆకస్మిక మృతి విచారకరమని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఎం.బాలకృష్ణ యాదవ్ అన్నారు. విష్ణుస్వరూప్ ఇక లేరన్న విషయం జీర్ణించుకోలేనిదన్నారు.

విజ్ఞాన ప్రదర్శనతో మేధోసంపత్తి

చెన్నూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విజ్ఞాన ప్రదర్శనతో మేధోసంపత్తి పెరుగుతుందని ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు అన్నారు. చెన్నూరు బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు మండలంలోని అన్ని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

వికాస్ హైస్కూల్లో ఘనంగా ఈ-డెక్ డే



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ సలీం బాషా, కరస్పాండెంట్ వికాస్ హరికృష్ణ, అధ్యాపకుడు ఆనంద్‌బాబు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని అక్కాయపల్లె వికాస్ హైస్కూల్లో శనివారం ఘనంగా ఈ-డెక్‌డేని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సలీం బాషా, లెక్చరర్ అనందబాబు, రాజమోహన్ హాజరయ్యారు. కరస్పాండెంట్ వికాస్ హరికృష్ణతో కలిసి ప్రిన్సిపాల్ సలీంబాషా రిబ్బన్ కట్ చేసి ఈ-డెక్ డేని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటుచేసిన ప్రాజెక్టులనుపరిశీలించి వారి సృజనాత్మకతను కొనియాడారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ వికాస్ హరికృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు దాదాపు 300 ప్రాజెక్టులను ప్రదర్శించారని, దీని వల్ల విద్యార్థుల్లో క్రియేటివిటీ పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ఫాతిమ, హమీద్, స్వర్ణలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

145 జీవోను నిలుపుదల చేయాలని వినతి

కడప రూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) : కక్షిదారులను ఇబ్బందులకు గురిచేసే 145 జీవోను నిలుపుదల చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొగ్గుల గుర్రప్పనాయుడు కోరారు. శనివారం కడప పర్యటనకు వచ్చిన పవన్‌కళ్యాన్‌ను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు జయరామిరెడ్డి, చిన్నయ్య, చంద్రమోహన్ కలిసి వినతి పత్రం అందజేశారు. డిసెంట్రలైజ్ చేసేందుకు తగు నోట్‌ను ప్రిపేర్‌చేసి పంపిస్తే పరిశీలిస్తామని డిప్యూటీ సీఎం చెప్పడం వలన ఈగిల్ ఫాస్ట్ ట్రాక్ కోర్టు జీవో నెంబర్ 145 నిలుపుదల అవుతుందని పేర్కొన్నారు.

'విద్యుత్ చార్జీల బాదుడుకు బాధ్యుడు జగన్‌రెడ్డే'

కడప మారుతీనగర్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల బాదుడుకు బాధ్యుడు మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డేనని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మన్నూరు అక్బర్ ధ్వజమెత్తారు. శనివారం స్థానిక గుంతబజార్‌లోని ఆయన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రభుత్వ ఉద్యోగులకు భద్రత కల్పించాలి







కమలాపురం: నిరసన తెలుపుతున్న ప్రభుత్వ ఉద్యోగులు... కడప: ఎంపీడీవో జవహర్‌బాబును పరామర్శిస్తున్న డీహెచ్‌పీఎస్ నేతలు... చెన్నూరు: మాట్లాడుతున్న ఎంపీడీవో

● ఎంపీడీవోపై దాడికి నిరసన

కమలాపురం రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని ఈవోపీఆర్‌డీ కేజియా తెలిపారు. శుక్రవారం గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబు విధుల్లో ఉండగా దాడి చేసిందుకు నిరసనగా కమలాపురం ఎంపీడీవో కార్యాలయంలో భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ కరువైందని, చిన్న విషయానికి కూడా దాడులు జరుగుతున్నాయని, ఉన్నతాధికారులు స్పందించి దాడులు నివారించాలని కోరారు. ఎంపీడీవోపై దాడి చేయడం బాధాకరమని, ఏదైనా సమస్య ఉంటే కూర్చుని మాట్లాడుకోవాలే కానీ ఇలా బహిరంగంగా దాడులకు పాల్పడడం మంచి పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవోపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు.

ఎంపీడీవోపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి

చెన్నూరు, డిసెంబరు, 28 (ఆంధ్రజ్యోతి): గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై వైసీపీ గూండాలు దాడిచేయడం హేయమైన చర్య అని, వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ఉద్యోగులకు భద్రత కల్పించాలని చెన్నూరు ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు డిమాండ్ చేశారు. శనివారం గాలివీడు ఎంపీడీఓపై జరిగిన దాడిని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద తీవ్రంగా ఖండించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చట్టపరంగా తీసుకోవాల్సిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి - డీహెచ్‌పీఎస్

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గాలివీడు ఎంపీడీఓపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మునెయ్య, జిల్లా సహాయ కార్యదర్శి పి.చంద్రగుప్త డిమాండ్ చేశారు. శనివారం రిమ్స్ ఆసుపత్రిలో ఎంపీడీవో జవహర్‌బాబును పరామర్శించారు. వెంటనే అరెస్టు చేసి దళితులపై దాడులు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

పోరుబాటను డైవర్షన్ చేసేందుకే పవన్ పరామర్శ : వైసీపీ



మాట్లాడుతున్న రవీంద్రనాథరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలపై వైసీపీ చేసిన పోరుబాటను డైవర్ట్ చేసేందుకే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ ఎంపీడీఓ పరామర్శ అని వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డి ఆరోపించారు. శనివారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు తన డైవర్షన్ పాలిటిక్స్ కోసం పవన్‌కళ్యాణ్‌ను పంపారన్నారు.ఎంపీడీఓపై దాడి పథకం ప్రకారమేనన్నారు. టీడీపీ వారి తోపులాటలో ఎంపీడీఓ కుర్చీపై పడిదెబ్బ తగిలిందన్నారు. దాన్ని డిప్యూటీ సీఎం డైవర్ట్ చేస్తున్నారన్నారు. ముందుగానే ఎవరిపై కేసు పెట్టాలో కూడా నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ఎంపీడీఓకు ఏమీ కాకపోయినా ఆయన రిమ్స్‌కు తెచ్చి హడావుడి చేశారన్నారు. సింహాద్రిపురం మండలం దిద్దెకుంటలో రైతుకు మద్దతు ధర లేకపోవడం వల్లే పంట నష్టం కారణంగా ఆ రైతు కుటుంబం ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. అదే జగన్ సీఎంగా ఉంటే ఆ రైతు కుటుంబం చనిపోయేది కాదన్నారు.వైసీపీ నాయకులు పులి సునీల్‌కుమార్, నిత్యానందరెడ్డి, తిరుపాల్‌రెడ్డి, రామలక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతిని ప్రేమిస్తే అది మానవాళినందరినీ కాపాడుతుంది

మొక్కల పెంపకానికి రూ.1.12 లక్షల విరాళం



ఇన్‌చార్జ్ డీఎఫ్‌వో దివాకర్‌కు చెక్కును అందిస్తున్న డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి

ప్రొద్దుటూరు,డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) : ప్రకృతిని మనం ప్రేమిస్తే అది మానవాళినందరినీ కాపాడుతుందని ఇన్‌చార్జ్ డీఎఫ్‌వో దివాకర్ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం ప్రొద్దుటూరు పట్టణం ఎర్రగుంట్ల రోడ్డులో గల రాజీవ్ గాంధీ నేషనల్ పార్కులో 500 వందల మొక్కల పెంపకానికి ప్రముఖ గుండెవ్యాధి నిపుణుడు పాత కోట శ్రీనాథ్‌రెడ్డి 1.12 లక్షల విరాళాన్ని ఇన్‌చార్జ్ డీఎఫ్‌వో దివాకర్‌కు అందచేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ హేమాంజలి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ లక్ష్మీకుమారి, బీట్ ఆఫీసర్ హరీంద్ర రాజు, న్యాయవాది దాదాపీర్, డాక్టర్ ప్రతాప్ రెడ్డి, వనసంరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యం



కళాశాల వేదికను ప్రారంభిస్తున్న కళాశాల జాయింటు డైరెక్టరు కుమారస్వామి, స్వామి శివరామనందసరస్వతి

పోరుమామిళ్ల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే లక్ష్యమని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టరు డాక్టర్ డేవిడ్ కుమారస్వామి, స్వామి శివరామనంద సరస్వతి అన్నారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శామ్యూల్ డేవిడ్‌రాజ్ ఆధ్వర్యంలో డాక్టర్ వడ్డమాను శ్రీనివాసకుమార్ సహకారంతో నూతనంగా కళాశాలోల సిద్ధమైన కళావేదిక, క్యాంటీన్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాలలోని అన్నివిభాగాలను పరిశీలించి తరువాత కళాశాల సిబ్బంది, విద్యార్థులతోనూ పూర్వ విద్యార్థుల సమితితోనూ సమావేశం నిర్వహించి కళాశాల అభివృద్ధికి చేపట్టవలసిన అంశాల గురించి సూచనలు ఇచ్చారు.

గత ప్రభుత్వం నీటి సంఘాలను నిర్వీర్యం చేసింది

● ప్రాజెక్టు కమిటీ చైర్మన్ వెంకటరమణారెడ్డి



గేట్లను పరిశీలిస్తున్న వెంకటరమణారెడ్డి

బి.కోడూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం నీటి సంఘాలను నిర్వీర్యం చేయడంతో లోయర్ సగిలేరు ప్రాజెక్టు నుంచి బద్వేలు పెద్దచెరువుకు వెళ్లే కాల్వ గేట్ల మరమ్మతులు అధ్వానంగా ఉన్నాయని ఎల్ఎస్‌పీ కమిటీ చైర్మన్ ఈగ వెంకట రమణారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన ఇరిగేషన్ డీఈ వేణు గోపాలరెడ్డితో కలిసి ఎల్ఎస్‌పీ డ్యాంను పరిశీలించారు. అనంతరం బద్వేలు పెద్దచెరువు వెళ్లే కాల్వ వెంబడి పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం నీటి సంఘాలను నిర్వీర్యం చేయడంతో కాల్వ మరమ్మతులు, చెరువులకు ఉండే తూముల షట్టర్లు పూర్తిగా లేవని, దీంతో బ ద్వేలు పెద్దచెరువుకు నీళ్లు వెళ్లాలంటే కష్టంగా ఉందన్నారు. ఇప్పటికే మూకవారిపల్లె, మూలవారిపల్లె, పెదుళ్లపల్లె, అమ్మవారిపేట, గుంతపల్లె, బి.కోడూరు చెరువులు పూర్తిగా నిండి వృథాగా సగిలేటికి వెళుతున్నాయన్నారు.ఆయన వెంట పెద్దిరెడ్డి అమర్‌నాథరెడ్డి, మేకవారిపల్లె నీటి సంఘం అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రతన్‌టాటా జయంతి

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వ్యాపారవేత్త రతన్‌టాటా జయంతిని జనసేన పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకుడు మాదాసు మురళి , బాలాజీ, రవి, మధు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోపై దాడి దారుణం



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ప్రొద్దుటూరు ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, సిబ్బంది

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడిజిల్లాలోని గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై వైసీపీ నేతలు దాడులకు పాల్పడడం అమానుష చర్య అని, ఉద్యోగులకు భద్రత కల్పించాలని ప్రొద్దుటూరు ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండల ప్రజాపరిషత్ కార్యాలయం బయట ఎంపీడీవోతోపాటు కార్యాలయ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వ ఉద్యోగిపై కూడా ఇలాంటి దాడులు జరుగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రాజుపాలెం..: అన్నమయ్యజిల్లా గాలివీడు మండలం ఎంపీడీవో జవహర్‌బాబుపై జరిగిన దాడి పట్ల శనివారం రాజుపాలెం మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఇలాంటి ఘటనలు ఖండిస్తున్నామని ఎంపీడీవో రమణారెడ్డి అన్నారు. ఎంపీడీవోపై దాడి చాలా హేయమైన చర్య అని ఆయన తెలిపారు.

బద్వేలు..: అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం ఎంపీడీవో జవహర్‌బాబుపై జరిగిన దాడికి నిరసనగా శనివారం మండల పరిషత్ కార్యాలయంలో నిరసన ప్రదర్శన కార్యక్రమం చేపట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. గాలివీడు ఎంపీడీవోపై దాడిచేయడం హేయమైన చర్య అని, దాడిచేసిన వారిపై తక్షణమే చర్యలు చేపట్టాలని ఎంపీడీవో మల్లేశ్వరి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముద్దనూరు..: స్థానిక ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది గాలివీడు ఎంపీడీవోపై జరిగిన దాడికిపై శనివారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఎంపీడీవో ముకుందారెడ్డి ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాయం బయట నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వీరభద్రుడు, ఈవో నరసింహులు , కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: గాలివీడు మండల ఎంపీడీవో జవహర్‌బాబు పై వైసీపీ నాయకుల దాడి అమానుషమని వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో వారి అరాచకాలు అకృత్యాలతో విసిగెత్తిన జనం వారిని ఎన్నికల్లో చిత్తుగా ఓడించినా ఇంకా వారి తీరులో ఎలాంటి మార్పురాలేదన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు మద్దిలేటి, పెన్నానగర్ సుధాకర్ చిరంజీవి, మల్లి తదితరులు పాల్గొన్నారు.

గోపవరం..: గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై దాడి దారుణ విషయమని గోపవరం ఎంపీడీవో రామనాథరెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. ఇటువంటివి పునరావృత్తం కాకుండా కట్టుదిట్ట మైన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



బద్వేలు..నిరసన తెలుపుతున్న ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది



బద్వేలుటౌన్..: అన్నమయ్య జిల్లాలోని గాలివీడు ఎంపీడీఓ జవహర్‌బాబుపై జరిగినదాడికి పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలని మున్సిపల్ సిబ్బంది, సచివాలయం సిబ్బంది శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులపై ఇలాంటి దాడులు చేయడం అమానుషమని, దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని వారు కోరారు.

దళితుల స్థలాలను కబ్జా చేయడం దారుణం

జమ్మలమడుగు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నియోజకవర్గంలోని మైలవరం మండలం దొమ్మరనంద్యాల గ్రామం పెన్నానది పక్కన దళితుల స్థలాలను కూటమి కిందిస్థాయి నాయకులు ఆక్రమణలు చేసి దళితులను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని సీపీఎం కార్యదర్శి యేసుదాసు, కమిటీ సభ్యుడు దాసరి విజయ్ ఆరోపించారు. శనివారం మైలవరం మండలం దొమ్మరనంద్యాల గ్రామం పెన్నానది పక్కన దళితుల స్థలాలను ఆక్రమిస్తున్నారని ఘటనా స్థలంలో వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులను చంపి అయినా వారి స్థలాలను కబ్జా చేస్తామని కూటమిలో కొందరు నాయకులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. అధికారంలోకి రావడానికి ఎంతో దోహదపడిన ఎస్టీల గ్రామంలో కూటమి ప్రభుత్వానికి మంచి మెజార్టీ ప్రజలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇక్కడ ఎన్నో దశాబ్దాల కాలం నుంచి ఎస్టీలు నివశిస్తున్నారన్నారు. కొంతమంది గ్రూపుగా చేరి ఎస్టీలను బెదిరిస్తున్నారన్నారు. ఎక్స్‌కవేటర్‌తో తొక్కించి చంపుతామని బెదిరించడం దారుణమన్నారు. ఘటనాస్థలంలోనే నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బాధితులు సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

నాడు విద్యుత్తు చార్జీలు పెంచి నేడు ధర్నాలా ?



మాట్లాడుతున్న రితీశ్‌రెడ్డి

బద్వేలుటౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నాడు వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా, విద్యుత్తు చార్జీలు పెంచి, నేడు ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందని, గత వైసీపీ పాలనలోచేసిన పాపాలు నేడు రాష్ట్రానికి శాపాలుగా మారాయని టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితీశ్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో పదిసార్లు విద్యుత్తుచార్జీలు పెంచి ఆ భారాన్ని ప్రజలపై మోపిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదేనని, మీరు పెంచిన విద్యుత్తు చార్జీలు తగ్గించాలంటూ మీరే ధర్నా చేయడం సిగ్గుచేటన్నారు. వైసీపీ దొంగనాటకాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రాన్ని సర్వనాశనంచేసి మొసలికన్నీరు కార్చడం సరైందికాదన్నారు. వైసీపీ నాయకులు ఎన్నికుట్రలు పన్నినా, ఎన్ని ధర్నాలుచేసినా, ఎన్ని నాటకాలు ఆడినా , రాష్ట్ర ప్రజలు వైసీపీవారిని నమ్మరని ఆయన అన్నారు.

గ్రామాల్లో సమస్యలు వెంటనే పరిష్కరించండి

ఎర్రగుంట్ల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమస్యలు వెంటనే పరిష్కరించేందుకు కృషిచేయాలని అధికారులను ఎంపీడీవో వెంకటరమణయ్య సూచించారు. ఎర్రగుంట్ల మండల సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీడీవో సభాభవనంలో మండల ఉపాధ్యక్షుడు ఎం.వెంకటమోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అమలుచేస్తున్న అనేక పథకాలు ప్రజలకుచేరేలా చూడాలన్నారు. గృహాలు, తాగునీటి సమస్యలపై స్పందించాలన్నారు. కలమల్ల, చిలమకూరులో ఉన్న విద్యుత్ సమస్యలపై వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని విద్యుత్ ఏఈ సమాధానం తెలిపారు. చిలమకూరులో సచివాలయ ఎనర్జి అసిస్టెంట్‌పై ఎంపీటీసీ కొండయ్య ఫిర్యాదు చేశారు.ఈకార్యక్రమంలో తహసీల్దార్ శోభన్‌బాబు, సర్పంచులు, ఎంపీటీసీలు,అధికారులు పాల్గొన్నారు.

'వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పులపాలు'

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీపాలనలో రాష్ట్రం అప్పులపాలు అయిందని టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి సుంకర వేణుగోపాల్ విమర్శించారు. శనివారం టీడీపీ బీసీసెల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత అయిదు సంవత్సరాల పాలనలో వైసీపీ ప్రభుత్వం ఎనిమిదిసార్లు కరెంటు చార్జీలు పెంచిందని, మూడు సార్లు రిజిస్ట్రేషన్ చార్జీలు, ఆర్టీసీ బస్సు చార్జీలు పెంచిందన్నారు. పెట్రోలు, డీజిల్, మద్యం ధరలతోపాటు నిత్యావసర ధరలు ఆ పార్టీ పాలనలో పెరిగిపోయాయన్నారు. అధిక రేట్లతోవైసీపీ ప్రభుత్వం ప్రజలపై బారం మోపి వారి నడ్డి విరిచిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి సుబ్బరాజు, వాణిజ్య విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోమేధికం సుదర్శన్, మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఓటీఎస్'ను సద్వినియోగం చేసుకోవాలి

● ఏపీజీబీ రీజనల్ మేనేజరు సుశాంతకుమార్



మాట్లాడుతున్న రీజనల్ మేనేజరు

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వన్‌టైం సెటిల్‌మెంటు అవకాశాన్ని రైతన్నలు, డ్వాక్రా సంఘం మహిళలు, చిన్న వ్యాపారులు, ఖాతా దారులు సద్వినియోగం చేసుకోవాలని రాజంపేట డివిజన్ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజరు సుశాంత్ కుమార్ స్వారో పేర్కొన్నారు. శనివారం బ్రహ్మంగారిమఠం ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంకు పరిధిలోని సోమిరెడ్డిపల్లె, మదిరెడ్డిపల్లె, పాపిరెడ్డిపల్లె గ్రామాల్లో బ్యాంకు నుంచి అప్పులు తీసుకున్న ఖాతాదారుల వద్దకు రికవరీ కోసం వెళ్లారు. ఈ సందర్భంగా ఖాతాదారులతో ఆయన మాట్లాడుతూ రుణాలు పొంది సకాలంలో చెల్లించని వారు వన్‌టైం సెటిల్‌మెంటు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ నెల 31వతేదీతో అవకాశం కోల్పోతారని ఆయన తెలిపారు. అలాగే మొండి బకాయిలు ఉన్న ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్రాంచ్ మేనేజరు బాలాదిత్య, ఫీల్డ్‌ఆఫీసరు ఎస్‌కే అక్బర్, రాము, జయన్న, సురేంద్ర, గంగాధర్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి లక్ష్మీరాజా పేర్కొన్నారు. స్వర్ణోత్సవ మహాసభలను పురస్కరించుకుని మహాసభల ప్రచార శాఖ జమ్మలమడుగు నుంచి ప్రొద్దుటూరుకు చేరింది. ఈ సందర్భంగా అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలులో యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనవరి 5 నుంచి 8వ తేదీ వరకు కాకినాడలో స్వర్ణోత్సవ మహాసభలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. స్వర్ణోత్సవ వేడుకల్లో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్ బాబు, జిల్లా కార్యదర్శి రవీంద్రుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బద్వేలు..: ఉపాధ్యాయ ఉద్యమ దిక్సూచి యూటీఎఫ్ అని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా పేర్కొన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలను జయప్రదం చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ప్రచార జాతా శనివారం బద్వేలుకు చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు అయిన సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలను కాకినాడలో జనవరి 5వ తేది నుంచి 8వ తేది వరకు వరకు నిర్వహిస్తున్న ట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్‌కుమార్, పాళెం మహేష్‌బాబు, ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు జి.వెంకటసుబ్బారెడ్డి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు శివప్రసాద్, కుర్రాచెన్నయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేలండర్, డైరీ ఆవిష్కరణ

జమ్మలమడుగు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రోపాధ్యాయ సంఘం ప్రభుత్వానికి ఆచరణాత్మకమైన సూచనలు, సలహాలు ఇస్తుందని రాష్ట్ర ఎస్‌ఈఆర్‌టీ డైరెక్టర్ ఎం. వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. శనివారం రాత్రి 7 గంటలకు జమ్మలమడుగులో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం 2025 డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ గురుకుమార్, రీజినల్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, సాంకేతిక కమిటీ కన్వీనర్ మహమ్మద్‌గౌస్, వివిధ మండలాల ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళి

ప్రొద్దుటూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిల్ ఘనంగా నివాళులర్పించింది. శనివారం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని మన్మోహన్ సింగ్‌కు సంతాప సూచికంగా వాయిదా వేసి ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి సంతాపం ప్రకటించారు. అనంతరం సభను వాయిదా వేస్తున్నట్లు చైర్‌పర్సన్ భీముని పల్లె లక్ష్మీదేవి ప్రకటించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, కౌన్సిల్ సభ్యుడు కమిషనర్ మల్లికార్జున అధికారులు పాల్గొన్నారు.

మేకలు, పశువుల పెంపకానికి నిధులు

దువ్వూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో మేకలు, పశువుల పెంపకానికి షెడ్ల నిర్మాణం జరుగడంతో నిధులు మంజూరైనట్లు మండల ఉపాధి హామీ అధికారి వసంతకుమార్ తెలిపారు. పశువుల పెంపకానికి రూ.2.30 లక్షలు, మేకల పెంపకానికి రూ.2.30 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. ఈ పథకం ద్వారా 25 యూనిట్లు మంజూరు కాగా 22 యూనిట్లు నిర్మాణ దశలో ఉన్నట్లు చెప్పారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా సురేంద్రనాథరెడ్డి

ముద్దనూరు డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): ముద్దనూరు మండల బీజేపీ అధ్యక్షుడిగా సురేంద్రనాథరెడ్డిని ఎన్నుకున్నారు. బీజేపీ జిల్లా ఆధ్యక్షుడు వంగళ శశిభూషణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ప్రకటించారు.మండలంలో బీజేపీ మరింత బలోపేతానికి కృషి చేస్తానని సురేంద్రనాథరెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు డాక్టర్ మధుసూదనరెడ్డి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు విద్యార్థుల ఎంపిక

ముద్దనూరు డిసెంబరు28(ఆంధ్రజ్యోతి):స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు.విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలు ఎంతో గానో ఆకట్టుకున్నాయి.బాలిక ఉన్నత పాఠశాల విద్యార్థినీ జరీనా, యామవరం ఉన్నతపాఠశాల విద్యార్థిని ఎస్.కుమారి, విజయవాణి, టీచర్స్ కేటగిరిలో బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు జయకార్ జిల్లా స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంఈవో నాగేశ్వరనాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాశినాయన..:విద్యార్థుల్లో వైజ్ఞానిక,సాంకేతిక నైపుణ్యం పెంపొందించుటకు సైన్స్‌ఫెయిర్‌లు ఎంతోదోహదపడుతాయని ఎంఈవో నిర్మల పేర్కొన్నారు.శనివారం నర్సాపురం జడ్పీఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్‌ఫెయిర్ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో టీచర్ ప్రాజెక్ట్ విభాగంలో ఏపీ మోడల్ పాఠశాల ఉపాధ్యాయురాలు పెర్సీప్రేమా ప్రదర్శించిన జామెట్రిక్ పార్క్‌కు మొదటి బహుమతి,టీచర్ విద్యార్థుల విభాగంలో జటుకులపాడు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ఉపాధ్యాయుడు అనిల్ కుమార్,విద్యార్థి ప్రతాప్ ప్రదర్శించిన వాటర్ ఫిల్టర్‌కు మొదటి బహుమతికి ఎంపికయ్యాయి. అలాగే సమూహ ప్రాజెక్ట్ కింద రెడ్డికొట్టాల ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు విజయలక్ష్మి, విద్యార్థులు రెడ్డెమ్మ,లిఖిత ప్రదర్శించిన భూమిని కాపాడదాం విభాగం మొదటి బహుమతికి ఎంపికయ్యాయి.వీరందరు జనవరి 3వ తేదీన కడపలో నిర్వహించే జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొంటారన్నారు.



కాశినాయన..వైజ్ఞానిక ప్రదర్శనను పరిశీలిస్తున్న ఎంఈవో నిర్మల

ఖాజీపేట..: సైన్స్‌ఫెయిర్ విభాగంలో మూడు గ్రూపులను ఎంపిక చేసినట్లు ఎంఈవో స్వర్ణలత అన్నారు. శనివారం మండల పరిధిలోని బాలికోన్నత పాఠశాలలో సైన్స్ విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని హైస్కూలు విభాగానికి చెందిన విద్యార్థులకు సైన్స్ విజ్ఞాన ప్రదర్శన నిర్వహించడం జరిగిందని, అందులో జిల్లాస్థాయికి బాలికోన్నతపాఠశాల నుంచి అమృత, సరిత, బాయిస్ హైస్కూలు నుంచి అల్లారయ్య, నరేంద్ర, కస్తూరిబాగాంధీ పాఠశాల నుంచి ధనలక్ష్మి, మేరీశీల విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరు జిల్లాస్థాయిలో మూడో తేదీన నిర్వహించే ప్రదర్శనలో పాల్గొంటారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 నాగరాజు, నోడల్ అధికారి శివశంకర్, హెచ్‌ఎం. సుజాత, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

చాపాడు..: జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలకు మండలం నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈవో రవిశంకర్ పేర్కొన్నారు. చాపాడులోని జిల్లా పరిషత్ హైస్కూలులోనిర్వహించిన మండలస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలు నిర్వహించారు. టీచర్ ప్రాజెక్ట్, స్టూడెంట్ ప్రాజెక్టు, గ్రూపు ప్రాజెక్టు వంటివాటిని నిర్వహించారు. ఎనిమిది పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. నరహరిపురం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు దాన్యాలను నిలువచేసే స్టోర్స్, గోదాము అనే అంశంపై ప్రదర్శన చేశారు.

దీనికి సంబంధించి విద్యార్థులు వరుణ్, చాంద్‌బాషా మొదటి, తృతీయ బహుమతులు గెలుచుకున్నట్లు ఆయన చెప్పారు. చాపాడులోని పాఠశాలకు చెందిన విద్యార్థి హరనాథ్ సూర్యకాంతికి అద్భుతం అనే అంశంపై రెండో బహుమతి గెలుచుకున్నారు. ఎంఈవోలు వంశీకృష్ణ, హెచ్‌ఎంలు నరసింహాశాస్త్రి, మహమ్మద్‌గౌస్ విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు.